

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 218 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | మంగళవారం 16 డిసెంబర్ 2025 | వెల : 4/-

# ప్రధాన పార్టీలకు స్వతంత్రుల ఝలక్

- పంచాయతీ పోరులో ఓటర్ల భిన్నమైన తీర్పు
- రాష్ట్రంలో ముగిసిన రెండో విడత పంచాయతీ ఎన్నికలు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భిన్నమైన తీర్పునిచ్చిన ఓటర్లు
- 199 చోట్ల కాంగ్రెస్ మద్దతు దారులు, 117 చోట్ల బీజేపీ మద్దతు దారులు విజయం
- ఇక బీఆర్ఎస్ 99 స్థానాలతో మూడో స్థానానికి పరిమితమైంది.
- ఇండిపెండెంట్ అభ్యర్థులు 82 చోట్ల గెలుపొందటం రాజకీయ వైవిధ్యాన్ని చాటింది




హైదరాబాద్

రాష్ట్రంలో రెండో విడత పంచాయతీ ఎన్నికలు ఆదివారంతో ముగిశాయి. ఎన్నికల ఫలితాలను కూడా అదేరోజు ప్రకటించారు. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో ఓటర్లు మొదటి విడతతో పోల్చుకుంటే భిన్నమైన తీర్పు ఇచ్చినట్లుగా స్పష్టమవుతోంది. ఈసారి కాంగ్రెస్‌తో పాటు బీజేపీ, బీఆర్ఎస్‌లనూ ఆదరించినట్లుగా స్పష్టమైంది. నియోజకవర్గాల వారీగా నేతలు ప్రభావం చూపినట్టు వెల్లడైంది. రెండో దశలో ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముథోల్, సిర్పూర్(టి), బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని 28 మండలాల్లో 514 గ్రామ పంచాయతీలకు గానూ, 30 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఓచోట ఎన్నిక జరగలేదు. మిగిలిన 483 పంచాయతీల్లో 1,635 మంది సర్పంచి అభ్యర్థులు - మిగతా3లో



## లోక్‌సభలో వికసిత్ భారత్ శిక్ష అధిష్ఠాన్ బిల్లు


- వికసిత్ భారత్ శిక్ష అధిష్ఠాన్ బిల్లును జేపీసీ పంపే అవకాశం
- ఒకే గొడుగు కింద వికసిత్ భారత్ శిక్ష అధిష్ఠాన్ అనే కొత్త కమిషన్‌ను ఏర్పాటు
- 12 మంది సభ్యులతో కూడిన వికసిత్ భారత్ శిక్ష అధిష్ఠాన్ అనే అత్యున్నత కమిషన్ ఏర్పాటు
- ఒకే కమిషన్ ద్వారా విద్యా ప్రమాణాలు కఠినంగా అమలు చేయవచ్చు


## 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాలి

- బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది
- కోర్టు గడువు వల్ల పంచాయతీ ఎన్నికలకు వెళ్లాం
- బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం పోరాడుతున్నాం
- శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేసింది
- సామాజిక రిజర్వేషన్లపై దేశవ్యాప్తంగా ఉన్న 50 శాతం పరిమితి ఎత్తివేయాలని డిమాండ్ చేసింది.
- టీపీసీ చీఫ్ మహేష్ గౌడ్

ఢిల్లీ

తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలని బీసీ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు టీపీసీ చీఫ్ మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. 'బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది. కోర్టు గడువు వల్ల పంచాయతీ ఎన్నికలకు వెళ్లాం. బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం పోరాడుతున్నాం' అని తెలిపారు. ఈ మేరకు సోమవారం(డిసెంబర్ 15వ తేదీ) ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ - మిగతా3లో





## భారత్ సహా 25 దేశాల్లో వీసా దరఖాస్తు కేంద్రాల్లో సర్వీసు ఫీజు పెంపు

- జనవరి 1 నుంచి కొన్ని కేంద్రాల్లో అమల్లోకి పెంపు నిర్ణయం
- నిర్వహణపరమైన వ్యయాలు, ద్రవ్యోల్బణం కారణంగా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడి
- వెల్లడించిన న్యూజిలాండ్ ఇమ్మిగ్రేషన్ డిపార్టుమెంట్

## చైనా పార్టులు వద్దు..



- రూ.5,000 కోట్లతో స్వదేశీ డ్రోన్ల కొనుగోలుకు ఆర్మీ సిద్ధం
- భారీగా దేశీయ డ్రోన్లను సమకూర్చుకోనున్న సైన్యం
- కామికేజ్, నిఘా, సుదూర లక్ష్య ఛేదన డ్రోన్ల సమీకరణ
- జామింగ్, స్పూఫింగ్‌ను తట్టుకునేలా ప్రత్యేక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సామర్థ్యం



## ఢిల్లీలో వాయు కాలుష్యం.. పౌరులకు అడ్వైజరీ జారీ చేసిన సింగపూర్ హైకమిషనర్..!

- జనం తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులు
- ఇంట్లోనే ఉండాలని.. బయటకు వచ్చిన సమయంలో మాస్కులు ధరించాలి
- రాజధాని ప్రాంతంలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ లెవల్-4 అమలు

## ఇక కాంగ్రెస్‌కు కాలం చెల్లింది

- ఈ ఎన్నికల ఫలితాలు రేవంత్‌కు చెంపపెట్టు
- కేటీఆర్ సంచలన ట్వీట్
- పల్లె పల్లెనా అధికారపార్టీపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతం
- కాంగ్రెస్ అంటే అభయహస్తం కాదు.. రిక్త హస్తం అని రెండేళ్ల పాలనలోనే తేలిపోయింది
- 'రెండో దశ పంచాయతీ ఎన్నికల్లోనూ అద్వితీయ ఫలితాలు సాధించిన గులాబీ శ్రేణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు



హైదరాబాద్

తెలంగాణ రెండో విడత సర్పంచ్ ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ఇక కాంగ్రెస్‌కు కాలం చెల్లిందని తమ ఓటు ద్వారా పల్లె ప్రజలు చెప్పారని అన్నారు. తెలంగాణ బతుకుచిత్రాన్ని ఛిద్రంచేస్తున్న రేవంత్‌కు ఈ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టులాంటివని వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అంటే అభయహస్తం కాదు, రిక్త హస్తం అని - మిగతా3లో

## ఐసిస్‌తో సంబంధాలు.. ఉగ్రవాదుల అరెస్ట్

- ఐసిస్ ఉగ్రసంస్థ ఆదేశాల మేరకు భారత్‌లో ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం
- దేశవ్యాప్తంగా పలు చోట్ల భారీగా సోదాలు
- గత నెలలో ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో (నేషనల్ ఇన్విస్టిగేషన్ ఏజెన్సీ) అప్రమత్తం



## కేసీఆర్ ఆగయా!

- రంగంలోకి గులాబీ బాస్..
- గేరు మార్చనున్న కారు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటాలకు దిగాలని కేసీఆర్ భావిస్తున్నారు
- ఈ నెల 19న కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ ఎల్పీ భేటీ
- పార్టీ రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సంయుక్త సమావేశం జరగనుంది
- నీటిపారుదల ప్రాజెక్టులను కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా చేస్తోందని బీఆర్ఎస్ మండిపడుతోంది.



హైదరాబాద్

ప్రజా ఉద్యమానికి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ సిద్ధమవుతుంది. ప్రత్యక్షంగా గులాబీ బాస్ కేసీఆర్ రంగంలోకి దిగనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటాలకు దిగాలని కేసీఆర్ భావిస్తున్నారు. ఈ నెల 19న కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ ఎల్పీ భేటీ కానుంది. పార్టీ రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సంయుక్త సమావేశం జరగనుంది. నీటిపారుదల ప్రాజెక్టులను కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా చేస్తోందని బీఆర్ఎస్ మండిపడుతోంది. తెలంగాణకు సాగునీటి విషయంలో బీజేపీ కూడా అన్యాయం చేస్తుందని బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తోంది. ఏపీ ప్రభుత్వం జలదోపిడీకి బీజేపీ సహకరిస్తోందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. కాంగ్రెస్, బీజేపీ విధానాలను ఎదుర్కొంటామని బీజేపీ నేతలు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రత్యక్ష పోరాటాలకు దిగాలని కేసీఆర్ భావిస్తున్నారు. బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఈ నెల 19న మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ భేటీలో బీఆర్ఎస్ శాసనసభా పక్షంతోపాటు పార్టీ రాష్ట్ర కార్యవర్గం పాల్గొంటుంది. తెలంగాణ రైతాంగ సాగునీటి హక్కులను కాపాడుకునేందుకు నిర్మించే ప్రజా ఉద్యమంపై విస్తృతస్థాయి సమావేశంలో లోతుగా చర్చించాలని పార్టీ నిర్ణయించింది. నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మౌనం వహించకుండా ప్రత్యక్ష పోరాటానికి దిగాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఉద్యమ నిర్మాణానికి అనుసరించాల్సిన కార్యాచరణపై సమావేశంలో కీలక నిర్ణయాలు ఉంటాయని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

# ఢిల్లీలో వాయు కాలుష్యం..

# పౌరులకు అడ్వైజరీ జారీ చేసిన సింగపూర్ హైకమిషనర్!

దేశ రాజధాని ఢిల్లీ నగరంలో వాతావరణ కాలుష్యం కొనసాగుతున్నది. దాంతో జనం తీవ్రమైన శ్వాసకోశ సమస్యలతో ఇబ్బందులుపడుతున్నారు. ఈ క్రమంలో సింగపూర్ హైకమిషన్ ఢిల్లీ-నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లోని పౌరులకు అడ్వైజరీ జారీ చేసింది. ఇంట్లోనే ఉండాలని.. బయటకు వచ్చిన సమయంలో మాస్కులు ధరించాలని సూచించింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు 'సమీర్' యాప్ ప్రకారం.. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ మధ్యాహ్నం 2 గంటల సమయంలో 437గా నమోదైంది. ఢిల్లీలోని చాలా ప్రాంతాల్లో ఏక్యూఐ 400 అంతకంటే ఎక్కువగానే ఏక్యూఐ నమోదైంది. సింగపూర్ హైకమిషన్ సోషల్ మీడియా వేదికగా అడ్వైజరీ జారీ చేశారు. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతంలో గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ లెవల్-4 అమలవుతోందని పేర్కొంది. ఢిల్లీ ప్రభుత్వం ప్రజలు, ముఖ్యంగా పిల్లలు, శ్వాసకోశ, గుండె జబ్బులు ఉన్న వారు ఇంట్లోనే ఉండాలని.. బయటకు వెళ్లిన సందర్భంలో మాస్కులు ధరించాలని హైకమిషన్ సూచించింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో నివసించే సింగపూర్ పౌరులు సలహాలు పాటించాలని సింగపూర్ హైకమిషన్ కోరింది. తక్కువ దృశ్యమానత కారణంగా ఢిల్లీ-ఎన్‌సీఆర్‌కు, అక్కడి నుంచి వచ్చే విమానాలు ప్రభావితమవుతాయని అడ్వైజరీలో తెలిపింది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం, అనేక విమానయాన సంస్థలు సైతం హెచ్చరికలు జారీ చేశాయి. ప్రయాణీకులు అప్‌డేట్స్‌ను



విమానయాన సంస్థలను సంప్రదించాలని సూచించారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో నివసిస్తున్న సింగపూర్ పౌరులకు సహాయం అవసరమైతే వారి ఫోన్ నంబర్లలో సంప్రదించాలని నెంబర్లను విడుదల చేసింది. ఇదిలా ఉండగా.. ఢిల్లీలో వరుసగా మూడోరోజు వాయు కాలుష్యం తీవ్రంగా కొనసాగుతున్నది. దాంతో దేశీయ, అంతర్జాతీయ విమానాలు సైతం ప్రభావితం చేసింది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 400కిపైగా విమానాలు ఆలస్యం అయ్యాయి. 61 విమానాలు రద్దు కాగా.. ఐదు విమానాలను దారి మళ్లించారు.

# చైనా పార్టులు వద్దు..

భారత సైన్యం తన సామర్థ్యాన్ని మరింత పెంచుకునే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో, సుమారు రూ.5,000 కోట్ల విలువైన పూర్తి దేశీయ డ్రోన్ల కొనుగోలుకు ఆర్డర్లు ఇచ్చేందుకు సిద్ధమైంది. శత్రు దేశాల నుంచి ఎదురయ్యే జామింగ్, స్పూఫింగ్ వంటి ఎలక్ట్రానిక్ యుద్ధ తంత్రాలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా ఈ డ్రోన్లను ప్రత్యేకంగా రూపొందించారు. గతంలో పాకిస్థాన్, ఉగ్రవాద సంస్థలపై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎదురైన సవాళ్లను దృష్టిలో ఉంచుకుని సైన్యం ఈ డ్రోన్ల కోసం కఠినమైన పరీక్షలు నిర్వహించింది. అత్యవసర కొనుగోలు నిబంధనల కింద ఈ ప్రక్రియను చేపడుతుండగా, కేవలం దేశీయ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు మాత్రమే అవకాశం కల్పించారు. ముఖ్యంగా, ఈ డ్రోన్లలో చైనాకు చెందిన విడిభాగాలు ఏమాత్రం ఉండకూడదనే నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నారు. ది ఎకనామిక్ టైమ్స్ కథనం ప్రకారం, సైన్యం మూడు రకాల అవసరాల కోసం ఈ డ్రోన్లను సమకూర్చుకోనుంది. వీటిలో తక్కువ దూరంలోని లక్ష్యాలను ఛేదించే కామికేజ్ లేదా లోయిటరింగ్ డ్రోన్లు, సుదూర లక్ష్యాలను గుర్తించి ధ్వంసం చేసి తిరిగి వెనక్కి రాగల ప్రెసిషన్ డ్రోన్లు, నిఘా కోసం ఉపయోగించే యూఏవీలు ఉన్నాయి. ఈ డ్రోన్ల ఎంపిక కోసం భారత సైన్యం ప్రత్యేకంగా ఒక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ టెస్టింగ్ జోన్‌ను ఏర్పాటు చేసింది. ప్రయోగం మొదలైనప్పటి నుంచే తీవ్రమైన జామింగ్ పరిస్థితులను సృష్టించి వాటి పనితీరును పరీక్షించింది.



అలాగే, ఎత్తయిన పర్వత ప్రాంతాల్లో కూడా ఇవి ఎంత సమర్థవంతంగా పనిచేస్తాయో పరిశీలించింది. ఈ పరీక్షల్లో ప్రభుత్వ రంగ సంస్థ అయిన మ్యూనిషన్స్ ఇండియా లిమిటెడ్ అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, సుమారు రూ.500 కోట్ల విలువైన లోయిటరింగ్ మ్యూనిషన్స్ కాంట్రాక్టును దక్కించుకుంది. ఈ భారీ కొనుగోలుతో భవిష్యత్ యుద్ధాల్లో భారత సైన్యం నిఘా, దాడి సామర్థ్యాలు గణనీయంగా పెరగనున్నాయి.

# ఇంక్రిమెంటేగా...ఇచ్చేస్తే పోలా...

వడ్డించేటోళ్ళు మనోళ్ళయితే ఆ కిక్కే వేరప్పా...డిపార్ట్ మెంట్ ఏదైనా...ఫికరే లేదు. మన బాస్ కు మనం కాకా కొడితే చాలు. బాస్ ఈజ్ ఆల్వేజ్ రైట్ అనే సూత్రాన్ని గట్టిగా పాటిస్తే...జీతం అదంతటదే పెరుగుతుంది. తెలివితేటలు, శ్రద్ధ, నిబద్ధత...ఇవన్నీ తుప్పాస్... పెద్ద సార్ ను జాగ్రత్తగా చూసుకుని వారి కనుసన్నల్లో పడుంటే చాలు. అందుకే అక్కడి ఉద్యోగుల్లో కొందరికి ఎడాపెడా ఇంక్రిమెంట్లు వచ్చి పడుతున్నాయి. కారణం బాస్ భజనే. ఇదెక్కడో కాదండోయ్ సాక్షాత్తు న్యాయవ్యవస్థలోనే. అందరికీ శకునాలు చెప్పే బల్లి తానే కుడితిలో పడ్డట్టు...ఊరందరికీ న్యాయం చేసే పెద్దమనుషులు తమ కింది ఉద్యోగులకు మాత్రం తమను తోచినట్టుగా....తమకు నచ్చినట్టుగా ఇంక్రిమెంట్లు ఇస్తుండటంతో అందరూ ముక్కున వేలేసేకుని...ఔరా ఇలా కూడా చేస్తున్నారా అనుకుంటూ సన్నాయినొక్కుల నొక్కుతు న్నారు. సాదారణంగా ఓ కంపెనీలో... ప్రైవేటయినా... ప్రభుత్వం అయినా...పనిచేసే ఉద్యోగికి ప్రమోషన్ రావాలన్నా... కనీసం ఇంక్రిమెంట్ పడాలన్నా...సదరు ఉద్యోగి తలప్రాణం తోకకొస్తుంటుంది. ఎంత పనిచేసినా...ఎంత కష్టపడినా...బాస్ గుడ్ లుక్స్ లో లేకుంటే ఆ ఉద్యోగికి ప్రమోషన్, ఇంక్రిమెంట్ల మాట అటుంచి ఉద్యోగం నిలబట్టుకోవడమే కష్టంగా మారిపోతుంటుంది. ఇంక్రిమెంట్లు ఎండమావుల్లా ఊరిస్తుంటాయే కానీ జీతంలో వచ్చి చేరవు. ఏడాదంతా కష్టపడి గొడ్డులా పనిచేస్తే...చివర్లో వచ్చే ఇంక్రిమెంట్ కోసం బిక్కమొగం వేసుకుని ఎదురు చూస్తుంటే... పదో పరకో మొహాన కొట్టే కంపెనీలు ఎన్ని లేవు. అలాగని ఆ ఉద్యోగాన్ని వదిలేసుకునే ధైర్యం చేయలేరు. ఇదేం గానుగెద్దులాంటి జీవితంరా బాబు. ఖర్చులు కొండవీటి చాంతాడంత...జీతం మాత్రం గొర్రెబెత్తడంత అని నిట్టూర్చుకోవడం మినహా చేయగలిగేదేం ఉండదు.

ఎవరికి ఏ అన్యాయం జరిగినా కోర్టు తలుపులు తట్టుతుంటాం. మనకు న్యాయవ్యవస్థపై అపారమైన నమ్మకం...గౌరవం. ఎవరు అన్యాయం చేసినా అక్కడ న్యాయం దొరికే దొరుకుతుందని అనుకుంటుంటాం. అంతటి ప్రతిష్టాత్మకమైన సర్వోన్నత న్యాయస్థానంలోని ఉద్యోగం చేసేవారిలో కొందరికి అత్యధికంగా ఇంక్రిమెంట్లు



దక్కుతున్నాయి. ఎంతటి ప్రతిభావంతుడికైనా ఏడాదికి ఒక ఇంక్రిమెంట్ న్యాయం ధర్మం. కానీ ఇక్కడ మాత్రం కొందరికి ఇబ్బడి ముబ్బడిగా ఇంక్రిమెంట్లు వచ్చేస్తున్నాయి. పోనీ వారు చేస్తున్న పనికి గుర్తింపా అంటే అదేం కాదు...బాస్ ను మెప్పించినందుకే ఈ నజరానాలు అని తెలుస్తోంది.

సుప్రీం కోర్టులో ప్రధాన న్యాయమూర్తులు వారు తమ పదవీ కాలం ముగిసే సమయాన...వ్యవధి ఎంత తక్కువ కాలం అయినా సరే... రిటైర్ అయ్యేటైములో తమకు నచ్చిన వారికి...తమను మెప్పించిన వారికి ఇంక్రిమెంట్లు అప్పనంగా ఇచ్చేస్తున్నారు. ఏడాదికి ఒకసారి కంటే ఎక్కువ సార్లు ఇవ్వడానికి ప్రధాన న్యాయమూర్తులు కొందరు వెనకాడటం లేదు. ఇంక్రిమెంట్ ఇచ్చేందుకు వారికి అధికారం ఉందన్న ఏకైక కారణంతో తమ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారనేది విమర్శ. ఉద్యోగులకు వృత్తిగత నైపుణ్యం లేకున్నా...ఏడాదికి రెండు మూడు ఇంక్రిమెంట్లు ఉదారంగా ఇస్తున్నారు. ఇలా లబ్ది పొందన వారిలో సీజేఐ పర్సనల్ సిబ్బందే అధికం.

ఈ అవ్యవహారాన్ని గత నాలుగైదేళ్లుగా గమనిస్తే...ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 2000మంది ఉద్యోగులకు ఒక ఏడాదలో పలుసార్లు ఇంక్రిమెంట్లు లభించాయి. ప్రధాన న్యాయమూర్తి కనుసన్నల్లో మెదిలిన కొందరు సిబ్బందికి ఆరుసార్లు ఇంక్రిమెంట్లు పడ్డాయంటే...పరస్థితి ఎంత దారుణంగా తయారైందో తెలుస్తోంది. సాధారణ పరిస్థితిలో లభించే ఇంక్రిమెంట్ల కంటే 150 శాతం అధికంగా లభించడం ఇక్కడ గమనించదగ్గ విషయం. ఇలా అవ్యవస్థగా సాగిన అవ్యవహారం గురించి చర్చించేందుకు మాజీ ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ న్యాయమూర్తులతో ఓ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చాలా మంది న్యాయమూర్తులు కోర్టు ఎవరి సామ్రాజ్యమో కాదని... ప్రధాన న్యాయమూర్తులు ఇక్కడ రాజులు కారని, వారి ఇష్టారీతిగా ఏదో అగ్రహారాలు రాసిచ్చినట్లు ఇంక్రిమెంట్లు ఇవ్వడం సరికాదని భావించారు. సుదీర్ఘ చర్చానంతరం ఇలా ఇష్టారీతిగా ఇంక్రిమెంట్లు ఇచ్చే విధానాన్ని బంద్ చేయాలని ఫుల్ కోర్టు నిర్ణయించింది అలాగే కొందరు ఉద్యోగులకు అర్తరహితంగా ఇచ్చిన ఇంక్రిమెంట్లను ఉపసంహరించుకోవాలని కోర్టు భావిస్తోంది. పొరపాటు తెలుసుకుని సరిచేయడం సరే...అసలు సర్వోన్నత న్యాయస్థానంలో కొందరు ప్రధాన న్యాయమూర్తులు ఈ వ్యవహార శైలి ఏంటని కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

## ఐసిస్‌తో సంబంధాలు.. ఉగ్రవాదుల అరెస్ట్



ముంబైలో ఇద్దరు ఉగ్రవాదులను పంజాబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాజన్, మనీష్ బేడీ అనే ఇద్దరు టెర్రరిస్టులు పాకిస్థాన్‌లోని ఐసిస్ ఉగ్రసంస్థ ఆదేశాల మేరకు భారత్‌లో ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు వీరిని అరెస్టు చేశారు. వీరంతా ఆర్మేనియా నుంచి ఆపరేట్ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గత నెలలో ఢిల్లీ ఎర్రకోట వద్ద జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో (నేషనల్ ఇన్విస్టిగేషన్ ఏజెన్సీ) అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా పలు చోట్ల భారీగా సోదాలు నిర్వహిస్తుంది. అధికారులు ఇదివరకే పలువురు ఉగ్రవాదులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఎర్రకోట వద్ద జరిగిన బాంబుపేలుళ్లలో 15 మంది మృతిచెందగా అనేక మంది గాయపడ్డారు. కాగా ఈ ఘటనతో సంబంధమున్న నిందితులను దర్యాప్తు బృందాలు ఇది వరకే అరెస్టు చేశాయి.

## భారత్ సహా 25 దేశాల్లో వీసా దరఖాస్తు కేంద్రాల్లో సర్వీసు ఫీజు పెంపు



భారత్ సహా 25 దేశాల్లో వీసా దరఖాస్తు కేంద్రాల్లో వసూలు చేసే సర్వీసు ఫీజును పెంచుతున్నట్లు న్యూజిలాండ్ ప్రకటించింది. ఈ పెంపు జనవరి 1 నుంచి కొన్ని కేంద్రాల్లో అమల్లోకి రానుంది. నిర్వహణపరమైన వ్యయాలు, ద్రవ్యోల్బణం కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని న్యూజిలాండ్ ఇమ్మిగ్రేషన్ డిపార్ట్ మెంట్ వెల్లడించింది. న్యూజిలాండ్ వీసా కోసం ఇకముందు దరఖాస్తు చేసుకునేవారు ఈ మార్పును గమనించాలని సూచించారు. భారత్‌తో పాటు బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, పాకిస్థాన్, శ్రీలంక, సింగపూర్, జపాన్ తదితర 25 దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. వీసా దరఖాస్తు ఫీజుకు అదనంగా వీసా అప్లికేషన్ కేంద్రాలు వసూలు చేసే ఫీజు ఉంటుందని ఆ దేశ ఇమ్మిగ్రేషన్ డిపార్టుమెంట్ పేర్కొంది. ఇటీవల చేపట్టిన సిస్టమ్ అప్‌గ్రేడ్‌ల కారణంగా ఫీజు పెంపు చేపట్టవలసి వచ్చిందని తెలిపింది. దరఖాస్తులు సమర్పించే ముందు, ఫీజు వివరాలను సరిచూసుకోవాలని సూచించింది.

## శబరిమలలో కొనసాగుతున్న భక్తుల తాకిడి

కేరళ పంబ తీర్థం స్వామియే శరణం అయ్యప్ప ప్రతిధ్వనుల తో మారుమోగిపోతుంది. ఏ వైపు చూసినా అయ్యప్పస్వా ములే దర్శనమిస్తున్నారు. గతంతో పోలిస్తే ఈ సంవత్సరం ఇప్పటికే అధిక మ్నైత్తంలో స్వాములు అయ్యప్ప దర్శనం చేసుకున్నట్లు ట్రావెన్‌కోర్ దేవస్థానం తెలిపింది. ఇప్పటివరకూ అయ్యప్పస్వామిని 25 లక్షలకు పైగా భక్తులు దర్శించుకున్నట్లు అధికారులు ప్రకటించారు. శబరిమలలో అయ్యప్పస్వాముల రద్దీ కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా అయ్యప్పభక్తులు పెద్దఎత్తున పంబ సన్నిధానానికి చేరుకుంటున్నారు. అయ్యప్పస్వామికి ఇరుముడి సమర్పించి తమ మ్నెక్కులు పూర్తి చేసుకుంటున్నారు. ప్రారంభంలో స్వామివారి దర్శనానికి కొన్ని ఇబ్బందులు తలెత్తినా ప్రస్తుతం ఏర్పాట్లు మెరుగైనట్లు కేరళ పోలీసులు తెలిపారు. గత ఏడాది ఈ సమయం వరకూ దాదాపు 21 లక్షల మంది స్వామివారి దర్శనం చేసుకోగా ప్రస్తుతం ఆసంఖ్య 25 లక్షలు దాటిందన్నారు. మండల పూజకోసం అయ్యప్పస్వామి (అభరణాల ఊరేగింపు) "తంగ అంకి" రథోత్సవం డిసెంబర్ 23 ప్రారంభమవుతున్నట్లు అధికారులు తెలిపారు.ఉదయం 7గంటలకు అరణ్ముల పార్థసారథి ఆలయం నుంచి బయిలుదేరి 26న అయ్యప్ప సన్నిధానం చేరుకుటుందని తెలిపారు. 27వ తేదీన అభరణాల అలంకారం అనంతరం స్వామివారికి మండల పూజ జరుగుతుందని దేవస్థాన అధికారులు పేర్కొన్నారు. అయ్యప్ప స్వాములందరూ వారికి కేటాయించిన సమయాలలో స్వామివారి దర్శనానికి రావాలని పోలీసులు సూచించారు. అలా చేయడం ద్వారా ఇ?బ్బందులు తలెత్తకుండా ఉండడంతో పాటు ప్రశాంతంగా దర్శనం చేసుకోవచ్చని కేరళ పోలీసులు తెలిపారు.

## లోక్‌సభలో వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లు

**న్యూఢిల్లీ:** పార్లమెంట్ శీతాకల సమావేశాల్లో భాగంగా ఈరోజు(సోమవారం, డిసంబర్ 15వ తేదీ) లోక్‌సభలో కేంద్రం రెండు బిల్లులను ప్రవేశపెట్టింది. అందులో ఒకటి వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లు, మరొకటి ది రిపీలింగ్ అండ్ అమెండింగ్ బిల్లు. ఈ రెండు బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టింది కేంద్రం. అయితే వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లును జేపీసీ(జాయింట్ పార్లమెంటరీ కమిటీ) పంపే అవకాశం ఉంది.

**వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లు అంటే..**

ఉన్నత విద్య నియంత్రణను పూర్తిగా మార్చే ప్రయత్నంలో భాగంగా ఈ బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీటీఈ వంటి సంస్థలను రద్దు చేసి వాటి స్థానంలో ఒకే గొడుగు కింద వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ అనే కొత్త కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. 12 మంది సభ్యులతో కూడిన వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ అనే అత్యున్నత కమిషన్ ఏర్పాటుచేసి, ఉన్నత విద్యా విధానాలు, ప్రమాణాలు, నాణ్యత నియంత్రణను ఈ కమిషన్ పర్యవేక్షిస్తుంది. దీని ద్వారా కేంద్రానకి అధిక అధికారాలుంటాయి. దీని ఫలితంగా ఉన్నత విద్య నియమ నిబంధనలు అనేవి కేంద్రం నియంత్రణలోకి వస్తాయి. ముందుగా ప్రతిపాదించిన భారత ఉన్నత విద్యా కమిషన్ బిల్లును ఇప్పుడు వికసిత్ భారత్ శిక్ష అధిష్టాన్ బిల్లుగా మార్చారు.

**ప్రయోజనాలు**

సమగ్ర నియంత్రణగా అమలు చేయడానికి వీలవుతుంది. అన్ని ఉన్నత విద్యా సంస్థలకు ఒకే విధమైన ప్రమాణాలు.

విభిన్న సంస్థల మధ్య గందరగోళం తగ్గుతుంది.

ఒకే కమిషన్ ద్వారా విద్యా ప్రమాణాలు కఠినంగా అమలు చేయవచ్చు.

ది రిపీలింగ్ అండ్ అమెండింగ్ బిల్లు

పాత చట్టాలను రద్దు చేయడం లేదా వాటిలో మార్పులు చేయడం కోసం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే బిల్లు. ఇది కొత్త చట్టాలను తీసుకురావడానికి లేదా పాత చట్టాల్లోని అనవసరమైన, పాతబడ్డ నిబంధనలను తొలగించడానికి ఉపయోగిస్తారు ఇప్పటికే ఉన్న చట్టాల్లో మార్పులు చేయడం. ఉదాహరణకు, ఒక చట్టంలోని సెక్షన్‌లో పదాలను మార్చడం, కొత్త నిబంధనలను చేర్చడం, లేదా పాత నిబంధనలను సవరించడం జరుగుతంది. దీని ద్వారా చట్ట వ్యవస్థను సులభతరం చేయడం జరుగుతుంది.

రాజ్యసభలో ఎన్నికల సంస్కరణలపై చర్చ

మరొకవైపు రాజ్యసభలో ఎన్నికల సంస్కరణలపై చర్చ జరుగుతుంది. ఈ చర్చల్లో వైఎస్సార్‌సీపీ తరుఫున ఎంపీ వైవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఏపీ ఎన్నికల అక్రమాలపై ఎన్నికల సంఘం విచారణ జరపాలని ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ అక్రమాలకు బాధ్యులెవరో తేల్చాలని డిమాండ్ చేశారు. ఏపీలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో ఓట్లలో అనేక తేడాలున్నాయన్నారు. సీసీటీవీ ఫుటేజ అందుబాటులో ఉంచాలన్నారు. ఈవీఎంలను నమ్మలేని పరిస్థితి వచ్చిందని, పేపర్ బ్యాలెట్‌పై అందరికీ నమ్మకం ఉందన్నారు వైవీ సుబ్బారెడ్డి.

# గులాబీకి ఊహించని ఫలితాలు

**హైదరాబాద్ :** తెలంగాణలో మొదటి దశ పంచాయతీ ఎన్నికల ఫలితాలు ఇంట్రెస్టింగ్‌గా మారాయి. ఎన్నో ఆశలు పెట్టుకున్న అధికార పార్టీకి..బీఆర్ఎస్ కంటే ఎక్కువ స్థానాలే వచ్చాయి. అయితే ఫస్ట్ ఫేజ్ సర్పంచ్ ఎన్నికల ఫలితాలపై అధికార కాంగ్రెస్ అంత స్యాటిస్‌ఫైగా లేదట. పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతోంది. తొలి విడతలో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్న హస్తం పార్టీ.. మలి విడతలోనూ అదే జోరు కొనసాగించింది. ఆదివారం జరిగిన రెండో విడత ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులే అత్యధిక స్థానాల్లో విజయబావుటా ఎగురవేశారు. మలి విడతలో 192 మండలాల పరిధిలోని 3911 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగ్గా.. 2200కు పైగా స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. మెజారిటీ సీట్లను సాధించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అధికార పార్టీ తన పట్టును నిలుపుకున్నట్లయింది. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి కూడా మలి విడత ఫలితాలు కాస్త ఊరటనిచ్చాయి. మలి విడతలో మొత్తం 4332 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే వీటిలో 415 స్థానాలు ఏకగ్రీవం కాగా.. ఐదు గ్రామాల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. మిగిలిన 3,911 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. కాగా, రెండో విడతలో గెలిచిన స్వతంత్ర అభ్యర్థుల్లో ఎక్కువ మంది కాంగ్రెస్ రెబల్సే ఉండడం గమనార్హం.మొదటి విడతలో 4వేల 230 సర్పంచ్ స్థానాల్లో..ఏకగ్రీవాలతో కలిపి అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు 2వేల 425 స్థానాల్లో గెలిచారు.ఇక బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు 1,168 స్థానాల్లో గెలిచారు. బీజేపీ మద్దతు ఇచ్చిన స్థానాల్లో 189 మంది విజయం సాధించారు. సీపీఎం 24 సీట్లు, సీపీఐ 23 స్థానాలను గెలుచుకున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో స్వతంత్రులు 401 స్థానాల్లో సత్తా చాటారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన స్థానాలపై అధికార కాంగ్రెస్ పార్టీ అంతర్గతంగా కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తోంటే ప్రతిపక్ష బీఆర్ఎస్ మాత్రం ఆశ్చర్యపోతోందన్న చర్చ జరుగుతోంది.ఫస్ట్ ఫేజ్ పంచాయతీ ఎన్నికల్లో కనీసం 80 నుంచి 90 శాతం స్థానాల్లో గెలవాల్సిందని కాంగ్రెస్ అనుకుంటుంటే, అసలు ఏ మాత్రం పోటీ ఇవ్వలేమని భావించిన బీఆర్ఎస్ లోలోన తెగ హ్యాపీగా ఫీల్ అవుతోందట. అవును..పంచాయితీ ఎన్నికలను పెద్దగా పట్టించుకోకపోయినా ఫస్ట్ ఫేజ్‌లో సానుకూల ఫలితాలు రావడంతో ఇప్పుడు సీరియస్‌గా దృష్టి పెట్టిందట కారు పార్టస్థానిక సంస్థల ఎన్నికల్లో ఎప్పుడైనా అధికార పార్టీదే అప్పర్ హ్యాండ్ ఉంటుంది. పవర్‌లో ఉన్న పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులే మెజార్టీ స్థానాలను గెలవడం సర్వ సాధారణం. ఈ హోప్‌తోనే ఈ సారి పంచాయితీ ఎన్నికల్లో కనీసం 80 నుంచి 90 శాతం స్థానాల్లో విజయం సాధిస్తామని హస్తం పార్టీ ఆశించింది. కానీ మొదటి విడత ఎన్నికల్లో 57



శాతం స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చిందట. ఇదే ఇప్పుడు కాంగ్రెస్‌లో అసంతృప్తికి కారణంగా తెలుస్తోంది. ఇదే సమయంలో ఫస్ట్ ఫేజ్ పంచాయితీ ఎన్నికల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు 27 శాతం అనుకూల ఫలితాలు వచ్చాయి.ఓ రకంగా ఇది గులాబీ పార్టీ కూడా ఊహించలేదని అంటున్నారు. ఎందుకంటే అసలు బీఆర్ఎస్ పార్టీ పంచాయతీ ఎన్నికలను అంత సీరియస్‌గా తీసుకోలేదు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమితో కాస్త నిరాశలో ఉన్న గులాబీ పార్టీ లీడర్లు, క్యాడర్..పల్లె పోరుపై పెద్దగా దృష్టి పెట్టలేదు. కనీసం పార్టీ అధిష్టానం ఒక రివ్యూ కూడా చేయలేదు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నచోట మినహా మిగతా నియోజకవర్గాల్లో సర్పంచ్ ఎన్నికలను కారు పార్టీ పెద్దగా పట్టించుకోలేదని ముందు నుంచి ప్రచారం జరుగుతోంది.స్థానిక సంస్థల ఎన్నికలను మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఇంచార్జీలు చూసుకుంటారులే అని బీఆర్ఎస్ అధిష్టానం లైట్ తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు స్థానిక ఎన్నికల్లో ఎలాగూ అధికార కాంగ్రెస్ పార్టీదే పైచేయి ఉంటుందన్న ఉద్దేశంతో పెద్దగా పట్టించుకోలేదని అంటున్నారు. దీంతో గులాబీ పార్టీ అధిష్టానంతో పాటు..మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇంచార్జీలు కూడా లోకల్ బాడీ ఎన్నికలను లైట్ తీసుకున్నట్లే పార్టీలో చర్చ జరిగింది.గ్రామాల్లో జోరుగా పంచాయతీ ఎన్నికల రాజకీయం నడుస్తోంటే ఎమ్మెల్యేలు, ఇంచార్జీలు ఏ మాత్రం పట్టించుకోకుండా హైదరాబాద్‌లో ఉన్నారని తెలంగాణ భవన్ వర్గాల్లోనే టాక్ వినిపించింది. అయితే అధిష్టానం నుంచి అండ లేకపోయినా, ఎమ్మెల్యేలు, ఇంచార్జీలు పట్టించుకోకపోయినా..లోకల్ బీఆర్ఎస్ లీడర్లు మాత్రం పట్టుబట్టి..ఎన్నికల్లో ఫైట్ చేశారు. దీని ఫలితమే మొదటి విడత ఎన్నికల్లో 1,168 సర్పంచ్‌లను గెలిచేలా చేసిందని చెబుతున్నారు.ఏ మాత్రం ఊహించనట్లుగా ఫస్ట్ ఫేజ్ పంచాయతీ ఎన్నికల్లో 1,168 సర్పంచ్ స్థానాలను గెలవడంతో బీఆర్ఎస్ అధిష్టానం అలర్ట్ అయ్యిందట. సీరియస్‌గా తీసుకోకపోయినా ఇన్ని స్థానాల్లో గెలిచామంటే అదే ఇంకాస్త దృష్టి పెట్టి ఉంటే మరింత మెరుగ్గా రిజల్ట్స్ వచ్చేవని చర్చించుకుంటున్నారట. అందుకే సెకండ్, థర్డ్ ఫేజ్ పంచాయతీ ఎన్నికలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీరియస్‌గా దృష్టి పెట్టారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మాజీ మంత్రులు, ఇంచార్జీలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన కేటీఆర్..మిగతా రెండు విడత ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని చెప్పినట్లు తెలుస్తోంది.దీంతో వెంటనే జిల్లాల్లో ముఖ్యనేతలంతా రంగంలోకి దిగినట్లు తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి. ఈ రెండు విడతల్లో మరిన్ని ఎక్కువ సర్పంచ్ స్థానాలను గెలుచుకునే పట్టుదలతో నేతలు పనిచేస్తున్నారట. కాస్త ఆలస్యంగా మేలుకున్న బీఆర్ఎస్‌కు సర్పంచ్ ఎన్నికల సమరం ముగిసే నాటికి ఎంతవరకు అనుకూల ఫలితాలు వస్తాయో చూడాలి మరి.

# కాలుష్య కాసారంగా రామగుండం...

**అదిలాబాద్ :** రామగుండం- జైపూర్ ఇండస్ట్రి యల్ కారిడార్ ప్రాంతం ఇప్పుడు రాష్ట్రంలోనే అత్యంత ప్రమాదకర ప్రాంతంగా మారింది. వాయు, జల కాలుష్యంగా పతాక స్థాయికి చేరడంతో ప్రజారోగ్య పరిరక్షణ ప్రమాదంలో పడింది. ఈ ప్రాం తంలో సుమారు 15 లక్షల జనాభా ఉండ గా, సుమారు 6 వేల మంది క్యాన్సర్ బారిన పడ్డారు. వేలాది మందికి ప్రీ క్యాన్సర్ లక్షణాలు బయటపడ్డాయి.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టారీతిన బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలు, సిమెం ట్ ఫ్యాక్టరీలకు అనుమతులు ఇస్తుండటం తో కాలుష్యం రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ ప్రాంతంలోని 5,400 మెగా వాట్ల థర్మల్ పవర్ ప్లాంట్లలో యాజమాన్యాలు ఏటా దాదాపు 50 లక్షల టన్నుల బొగ్గు మండిస్తున్నాయి. అలాగే సిమెంట్ తయారీ కోసం ఆ కంపెనీ 95 లక్షల టన్నుల బొగ్గును మండిస్తున్నది. ఇవి కాక త్వరలో రామగుండం ప్రాంతంలో మూడు కొత్త థర్మల్ పవర్ ప్లాంట్లు ఏర్పా టు చేయాలనే ప్రణాళికలు ఉన్నాయి.అదేజరిగితే ఈ ప్రాంతంలో వాయు, జల కాలుష్యం అత్యంత ప్రమాదకరస్థాయికి పెరుగనుందని నిపుణులు హెచ్చరిస్తున్నా రు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రమాణాల ప్రకారం 5 మైక్రోగ్రా మ్ పర్ క్యూబిక్ మీటర్‌లో పీఎం 2.5 కాలుష్య రేణువులు ఉండటం ప్రమాదక రం కాదు. కానీ, నవంబర్ నెలలో రామగుండం పరిసర ప్రాంతాల్లో ఆ సూచిక 175- 250 మైక్రోగ్రామ్ పర్ క్యూబిక్ మీటర్ నమోదైంది. అంటే సురక్షిత పరిమితికి కంటే.. అది 35-50 రెట్లు ఎక్కువ. బొగ్గు మండిన తర్వాత మిగిలిన బూడిదలో దాదాపు 40 శాతం అల్యూమినియం అవశేషాలు ఉన్నట్లు తేలింది. ఈ బూడిద వ్యవసాయ భూములు, అడవుల్లో పడుతుండటంతో సారవంతమైన భూములు నిస్సారమవుతున్నాయి.



అటవీప్రాంతం పచ్చదనాన్ని కోల్పోతున్నది. అలా రామగుండం, కమాన్‌పూర్, జైపూ ర్ మండలాల్లో 80,000 ఎకరాలకు పైగా నిస్సారమైందని ఓ అంచనా.పంట దిగుబడులు తగ్గిపోవడంతో రైతులు, కూలీల జీవనాధారం దెబ్బతింటోంది. భూగర్భజలాలు కూడా కలుషితం అవతుండటంతో తాగునీరు కూడా విషమ యమవుతున్నది. ఒకప్పుడు స్నానానికి ఉపయోగపడే 'సీ' కేటగిరీలో ఉన్న గోదావరి జలాలు ఇప్పుడు 'హెచ్' కేటగిరీకి పడిపోయింది. ఎన్‌టీపీసీ, జైపూర్ థర్మ ల్ ప్లాంట్, ఆర్ఎఫ్‌సీఎల్, బసంత్‌నగర్ సి మెంట్ ఫ్యాక్టరీల నుంచి విడుదలయ్యే వ్య ర్థాలే కారణమని స్థానికులు చెబుతున్నారు. కాలుష్యం కారణంగా ఈ ప్రాంతంలో ఆనారోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయి. ప్రజారోగ్యం ప్రమాదపు అంచు నుంది. ఇటీవల రోహిణి అనే సంస్థ నిర్వహించిన ఓ వైద్య శిబిరంలో వైద్యులు 5,000 మందిని పరీక్షించగా, వీరిలో 183 మందికి ప్రీ లక్షణాలు ఉన్నాయని తేలింది. అలాగే 20 మందికి క్యాన్సర్ నిర్ధారణ అయింది. అలాగే ఎంతోమంది గుండె జబ్బులు, మూ?ర తపిండ వ్యాధులు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నట్లు తేలింది.ఇక్కడ కొన్ని అకస్మాత్తు మరణాల సంఖ్య కూడా పెరుగు తండటం గమనార్హం. పరిస్థితి చేయిజారకముందే గోదావరిఖని, మంచిర్యాల, నస్పూ ర్ ప్రాంతాల ఎమ్మెల్యేలు, ఎంపీలు, 100 గ్రామ పంచాయతీల సర్పంచులు, 170 మున్సిపల్ వార్డు సభ్యులు వెంటనే స్పందించాలని, కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతున్నది.విద్యుత్ ఉత్పత్తి కోసం యజామాన్యాలు ఏటా 50 లక్షల టన్నుల బొగ్గు, సిమెంట్ త యారీ కోసం 95 లక్షల టన్నుల బొగ్గును మండిస్తున్నది. పీఎం 2.5 స్థాయి డబ్ల్యూహెచ్‌వో పరిమితికి 35 రెట్లు ఎక్కువ న మోదవుతుండటం ఆందోళన కలిగించే విష యం. కాలుష్యంతో ఈ ప్రాంతంలో 80వేల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు నిస్సారమవుతున్నాయి. అటవీప్రాంతం కాలుష్యమై పచ్చదనాన్ని కోల్పోతున్నది. గోదావరి జలాల నాణ్యత 'సీ' కేటగిరీ నుంచి 'హెచ్' కేటగిరీకి పడిపోయింది. కాలుష్య ప్రభావంతో 15 లక్షల జనాభాలో సుమారు 6,000 మంది క్యాన్సర్ బారినపడ్డారు. మరకొంతమందిలో ఇప్పుడిప్పుడే క్యాన్సర్ లక్షణాలు బయటపడుతున్నాయి.

# బండి వర్సెస్ ఈటెల

**కరీంనగర్ :** కేంద్రమంత్రి బండిసంజయ్ వర్సెస్ ఈటల రాజేందర్. ఇది కొత్త ఎపిసోడేం కాదు. తెలంగాణ స్థానిక ఎన్నికలు రాబోతున్నాయన్న ప్రచారం స్టార్ట్ అయినప్పటి నుంచే ఇద్దరు నేతల మధ్య కోల్డ్ వార్ రచ్చకెక్కింది. నువ్వానేనా అన్నట్లుగా ఒకరిపై మరొకరు ఇండైరెక్ట్ కామెంట్స్‌తో హీటెక్కించారు. తన పార్లమెంట్ పరిధిలో తన అనుచరులే అభ్యర్థులుగా ఉంటారని సంజయ్..హుజురాబాద్ తన ఇలాకా..అక్కడ తన అనుచరులే బరిలో ఉంటారు..గెలిపించుకుని తీరుతానంటూ ఈటల హాట్ కామెంట్స్ చేసి చర్చకు తెరలేపారు.ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేసింది. ఇలా ఫస్ట్ ఫేజ్ ఎన్నికలు పూర్తయ్యాయో లేదో..మరోసారి వార్ ఆఫ్ వర్డ్స్ హీటెక్కిస్తున్నాయి. స్వయంగా కేంద్రమంత్రి బండి సంజయ్ ఆఫీస్ నుంచి రిలీజ్ అయిన ఒక ప్రెస్ నోట్‌తో..పాత వివాదం కొత్త రచ్చకు దారితీసినట్లు అయింది. హుజురాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండలంలో బోణీ కొట్టిన బీజేపీ..బీజేపీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి ర్యాకం శ్రీనివాస్ 90 ఓట్లతో విజయం అంటూ కేంద్రమంత్రి బండిసంజయ్ ఆఫీస్ ప్రెస్ నోట్ రిలీజ్ చేసింది.వరకు ఓకే. కానీ ఈటల రాజేందర్ బలపర్చిన అభ్యర్థి ర్యాకం సంపత్ ఓటమి అంటూ ఆ పత్రికా ప్రకటనలో ఉండటమే రాద్ధాంతం అవుతోంది. ఈ ప్రెస్ నోట్ హుజురాబాద్ బీజేపీలోనే కాదు రాష్ట్ర పార్టీలోనూ చర్చనీయాంశంగా మారింది. బీజేపీ బలపరిచిన అభ్యర్థి గెలిచాడు అంటే సరిపోయేది..ఈటల రాజేందర్ బలపరిచిన అభ్యర్థి ఓడిపోయాడని పత్రిక ప్రకటన రిలీజ్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని చర్చించుకుంటున్నారట కొందరు నేతలు.బండి సంజయ్ ఆఫీస్ నుంచి విడుదలైన పత్రిక ప్రకటనపై పరోక్షంగా ఎంపీ ఈటల రాజేందర్ రియాక్ట్ అయ్యారు. మరింత మంట పుట్టించేలా..అవగాహన లేని వారు పెడుతున్న సోషల్ మీడియా పోస్టులపై పార్టీ చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ ఎన్నికలు ప్రజల్లో వారి వెనుకున్న నాయకుడు, పార్టీని చూసి అభ్యర్థులకు అండగా నిలుస్తున్నారు.గెలిచిన తర్వాత ఐదు లక్షలు 10 లక్షలు ఇస్తాం..మా పార్టీకి రండి..మా పార్టీలో గెలిచినట్టు చెప్పుకోండి అని చిల్లర ప్రయత్నం కొనసాగుతోందన్నారు. ఎన్నికల ముందే తమకు ఫలానా నాయకుడి ఆశీర్వాదం ఉందని చెప్తే మంచిది కానీ..గెలిచిన తర్వాత ఆయన వెనక..ఈయన వెనక పోతామంటే..ప్రజలు విశ్వసించే అవకాశం ఉండదంటూ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు కాక పుట్టిస్తున్నాయి. వర్గ విభేదాలు పక్కన పెట్టండి..తెలంగాణలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయండి అంటూ..ప్రధాని మోదీ తెలంగాణ ఎంపీలపై ఆగ్రహం వ్యక్తం చేశారని ప్రచారం జరిగి రెండు రోజులు కూడా కాలేదు..అంతలోపే బండి, ఈటల ఎపిసోడ్‌లో పార్టీ క్యాడర్‌లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందట. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పినా ఇద్దరు కీలక నేతల తీరు మారదా అంటూ గుసగుసలాడుకుంటున్నారట. రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు కూడా బండి, ఈటల తీరుతో తల పట్టుకుంటున్నారట. ఇక అధిష్టానమే జోక్యం చేసుకుని ఇద్దరు నేతలకు సర్ధిచెప్పి..కలిసి పనిచేసేలా చేయాలని కోరుకుంటున్నారట నేతలు.

## ఇక కాంగ్రెస్‌కు కాలం చెల్లింది

-మొదటిపేజీ తరువాయి

రెండేళ్ల పాలనలోనే తేలిపోయిందని కేటీఆర్ విమర్శలు గుప్పించారు.

**కేటీఆర్ ట్వీట్..**

'రెండో దశ పంచాయతీ ఎన్నికల్లోనూ అద్వితీయ ఫలితాలు సాధించిన గులాబీ శ్రేణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ సత్తాచాటిన బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలకు ప్రత్యేకంగా అభినందనలు. అడ్డదారిలో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ఇక కాలం చెల్లిందని పల్లె ప్రజలు తమ ఓటు ద్వారా మరోసారి తేల్చిచెప్పారు. ప్రభుత్వ పెద్దలు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల్లోనూ అధికార పార్టీ కోటలు బీటలు వారడం, రాష్ట్రంలో మారుతున్న రాజకీయ ముఖచిత్రానికి నిదర్శనం. రేవంత్ రెండేళ్ల పరిపాలనా వైఫల్యాలకు తోడు, గ్యారెంటీల అమలులో చేసిన ఘోరమైన మోసాలే, కాంగ్రెస్‌కు ఉరితాళ్లుగా మారి ఆ పార్టీని ప్రజాక్షేత్రంలో కూకటివేళ్లతో పెకిలిస్తున్నాయి. పార్టీ గుర్తు లేని ఎన్నికల్లోనే అధికార పార్టీ దుస్థితి ఇలా ఉంటే, ఇక పార్టీ గుర్తుపై జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఇంతకన్నా ఘోర పరాభవం తప్పదు. అరాచక పాలనతో తెలంగాణ బతుకుచిత్రాన్ని ఛిద్రం చేస్తున్న రేవంత్ రెడ్డికి పంచాయతీ ఎన్నికల్లో వస్తున్న ఈ ఫలితాలు చెంపపెట్టులాంటివి' అంటూ ట్వీట్ చేశారు. 'నాడు బీఆర్ఎస్ హయాంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అధికార పక్షం ఏకపక్షంగా విజయం సాధిస్తే, నేడు కాంగ్రెస్ సగం పంచాయతీలను కూడా గెలవకపోవడం, పల్లె పల్లెనా అధికారపార్టీపై పెల్లుబుకుతున్న ప్రజాగ్రహానికి స్పష్టమైన సంకేతం. కాంగ్రెస్ అంటే అభయహస్తం కాదు, రిక్త హస్తం అని రెండేళ్ల పాలనలోనే తేలిపోయిన నేపథ్యంలో ఇక సీఎం రేవంత్ అసమర్థ పాలనలో అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికార పార్టీ అడ్రస్ గల్లంతు కావడం కాయం. రెండేళ్లుగా కాంగ్రెస్ సర్కారు చేస్తున్న అరాచకాలు, మోసాలు, అవినీతి కుంభకోణాలపై అనునిత్యం బీఆర్ఎస్ సాగిస్తున్న సమరాన్ని గుండెల నిండా ఆశీర్వదిస్తున్న తెలంగాణ సమాజానికి శిరస్సు వంచి పాదాభివందనలు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను కాంగ్రెస్ కబంధహస్తాల నుంచి విడిపించే ఈ పోరాటాన్ని తమ భుజాలపై మోస్తున్న గులాబీ సైనికులను పార్టీ కంటికి రెప్పలా కాపాడుకుంటుంది. కష్టకాలంలో బీఆర్ఎస్ వెన్నంటి నిలిచిన ప్రతిఒక్కరి ఉజ్వల రాజకీయ భవిష్యత్తుకు తప్పకుండా పార్టీ బంగారు బాటలు వేస్తుంది' అంటూ మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాలి

-మొదటిపేజీ తరువాయి

సంఘాల జేఏసీ ధర్నా నిర్వహించింది. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బీసీ రిజర్వేషన్లు 42%కు పెంపు చట్టానికి ఆమోదం కోరుతూ ఆందోళన చేపట్టింది జేఏసీ. శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలపాలని డిమాండ్ చేసింది. సామాజిక రిజర్వేషన్లపై దేశవ్యాప్తంగా ఉన్న 50 శాతం పరిమితి ఎత్తివేయాలని డిమాండ్ చేసింది. ఈ ధర్నాలో మహేష్‌గౌడ్‌తో పాటు వి. హనుమంతరావు, విల్సన్ ఎంపీ (డిఎంకే), కే. నారాయణ (సిపిఐ), వి. శ్రీనివాస్ గౌడ్, వద్దిరాజు రవిచంద్ర ఎంపీ, మల్లు రవి ఎంపీ, అనిల్ కుమార్ యాదవ్‌లు హాజరయ్యారు.

## ప్రధాన పార్టీలకు స్వతంత్రుల ఝలక్

-మొదటిపేజీ తరువాయి




బరిలో నిలిచారు. ఓట్ల లెక్కింపు అనంతరం కాంగ్రెస్ పార్టీ మద్ధతుదారులు 199 చోట్ల విజయం సాధించి మొదటి స్థానంలో నిలిస్తే, 117 స్థానాలతో బీజేపీ రెండో స్థానంలో స్థానంలో నిలిచింది. ఇక బీఆర్ఎస్ 99 స్థానాలతో మూడో స్థానానికి పరిమితమైంది. ఇండిపెండెంట్ అభ్యర్థులు 82 చోట్ల గెలుపొందటం రాజకీయ వైవిధ్యాన్ని చాటింది.

కాంగ్రెస్ పార్టీ : మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి నియోజకవర్గంలో హస్తం పార్టీ ఆధిక్యతను ప్రదర్శించింది. బీఆర్ఎస్ నామమాత్రపు ఉనికిని చాటుకుంది. కొన్నిచోట్ల ఇండిపెండెంట్ అభ్యర్థులు గెలవగా, బీజేపీ అసలు ఖాతానే తెరవలేకపోవడం గమనార్హం. రాష్ట్రమంత్రి వివేక్ సోదరుడైన ఎమ్మెల్యే వినోద్ ప్రాతినిధ్యం వహిస్తున్న బెల్లంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ ప్రయత్నాలు కూడా అంతగా ఫలించలేదు. బెల్లంపల్లి, కాసిపేట, నెన్నెల, కన్నెపల్లి, వేమనపల్లి, భీమిని మండలాల్లో కాంగ్రెస్? పార్టీ ఆధిక్యతను ప్రదర్శించింది.

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్(టి) నియోజకర్గం పరిధిలో హస్తం పార్టీ వెనకబడింది. ఆదిలాబాద్ జిల్లాలో మాత్రం ఆధిక్యతను ప్రదర్శించింది. అదే నియోజకవర్గం పరిధిలోకి వచ్చేసరికి బీజేపీ కంటే వెనకబడింది. నిర్మల్ జిల్లాలో హస్తం పార్టీ రెండో స్థానానికి పరిమితమైంది. మాజీ మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి తన స్వగ్రామం ఎల్లపల్లిలో సైతం తన అభ్యర్థిని గెలిపించుకోలేకపోవటం స్థానికంగా చర్చనీయాంశమైంది.

**కమల వికాసం:**

మొదటి విడత ఎన్నికలతో పోల్చితే రెండో విడతలో కమలం వికసించిందని చెప్పవచ్చు. ప్రధానంగా ఆ పార్టీ ఎమ్మెల్యేలైన పాయల్ శంకర్, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్ ప్రాంతాల్లో స్పష్టమైన ఆధిక్యతను చాటుకుంది. క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు రావటంతో కమల శ్రేణుల్లో ఉత్సాహం కనిపించినప్పటికీ, చాలాచోట్ల స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచిన వారు గెలుపొందటం ప్రాధాన్యతను సంతరించుకుంది. కుమురం భీం జిల్లాలో సిర్పూర్(టి) ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్?బాబు నియోజవకర్గంలో 22 పంచాయతీలను కైవసం చేసుకున్నప్పటికీ బెల్లంపల్లి నియోజకవర్గంలో ఒక్కటంటే ఒక్క సర్పంచి స్థానాన్నీ గెలుచుకోలేకపోయింది.

**వన్నెతగ్గిన గులాబీ:**

ఉమ్మడి జిల్లాలో సిర్పూర్ నియోజకవర్గంలో కోనప్ప చొరవతో ప్రభావం చూపిన బీఆర్ఎస్?, బోథ్ నియోజకర్గంలో స్వల్ప ఆధిక్యతను సాధించింది. మిగిలిన చోట్ల దాని ప్రభావం మాత్రం పెద్దగా కనిపించలేదు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని మాజీమంత్రి జోగు రామన్న ప్రయత్నం చేసినప్పటికీ మూడో స్థానానికే పరిమితమవగా, నిర్మల్ జిల్లాలోనైతే పూర్తిగా చతికిలపడింది. ఈ స్థానిక సంస్థల ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. స్వతంత్ర అభ్యర్థులు కొన్నిచోట్ల విజయం సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ముగిసిన తుది విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం

రాష్ట్రంలో తుది విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగిసింది. డిసెంబర్ 11న తొలి విడత, 14న రెండో విడత పంచాయతీ ఎన్నికలు జరిగాయి. తుది విడత ఎలక్షన్ డిసెంబర్ 17న జరగనుంది. దీంతో అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఇవాళ్టితో ముగిసింది. ఇన్ని రోజులు గ్రామాల్లో హోరెత్తించిన మైకులు మూగబోయ్యాయి. డిసెంబర్ 17న 182 మండలాలు 4157 గ్రామ పంచాయతీలు,28, 406 వార్డుల్లో పోలింగ్ జరగనుంది. తుది విడతలో 394 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. తుది విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 53 లక్షల 6వేల 401 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో 26 లక్షల 1861 పురుష ఓటర్లు, 27 లక్షల 4 వేల 394 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అలానే146 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. తుది విడత పంచాయతీ ఎన్నికల కోసం 36 వేల 483 పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. ఇవాళ(సోమవారం) సాయంత్రం 6 గంటల నుంచి ఎల్లుండి సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. ఎల్లుండి(బుధవారం) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తుది విడత గ్రామ పంచాయతీ పోలింగ్ జరగనుంది. ఇక రెండో విడత పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ దుమ్మురేపింది. మొత్తం 4,333 స్థానాల్లో సగాని కంటే ఎక్కువ గెలిచి ఆధిక్యాన్ని చాటారు. సిద్దిపేట, కుమురం భీం, జనగామ, నిర్మల్ జిల్లాల మినహా మిగిలిన జిల్లాల్లో కాంగ్రెస్ బలపరిచిన వారే మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్నారు. తొలి విడత మాదిరిగానే రెండో విడతలోనూ ప్రతిపక్ష బీఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చి రెండో స్థానంలో నిలిచింది. బీజేపీ మద్దతుదారులకు నిర్మల్ జిల్లాలో మెజారిటీ స్థానాలు వచ్చాయి.

# గ్రామ ప్రజలే నా బలం.. గ్రామ అభివృద్ధే నాధ్యేయం






సర్పంచ్ అభ్యర్థి సెగ్యం వెంకటేష్

**మందమర్రి,డిసెంబర్15(సూర్యరేఖ)** మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామ బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి సెగ్యం వెంకటేష్ ప్రచారంలో తనదైన శైలిలో దూసుకుపోతున్నారు.సోమవారం గడపగడపకు తిరిగి తనకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పదవి కోసం కాదు గ్రామ ప్రజల శ్రేయస్సు కోసం పని చేస్తానని,గ్రామాన్ని అభివృద్ధి చేయడమే నా ప్రధాన లక్ష్యమని గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.సర్పంచ్ గా ఆదరిస్తే గ్రామ సర్వతోముకాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలోని ప్రతి సమస్యను తెలుసుకున్న వ్యక్తిగా నన్ను ఆదరించి గెలిపిస్తే గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఆమె పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధికి నిస్వార్థంగా సేవ చేసే భాగ్యం కల్పించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు.గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి పారదర్శకంగా అందిస్తానని అన్నారు. ఆదరించి ఓటు వేసి గెలిపిస్తే గ్రామ రూపురేఖలు మారుస్తూ డ్రైనేజీలు,సీసీ రోడ్లు,సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు,గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తానన్నారు.ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు వచ్చానని ఆశీర్వదించి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు.ఈ నెల17వ తేదీన జరిగే పంచాయతీ ఎన్నికల్లో తమ ఓటు నాకు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మద్దతు దారులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# కొంగోల్,నైన్ జలాల్పూర్ సర్పంచ్ అభ్యర్థుల హోరాహోరీ






**కొల్చారం,డిసెంబర్15(సూర్యరేఖ)** మెదక్ జిల్లా కొల్చారం మండలం కొంగోడు నాయిని జలాల్పూర్ గ్రామాలలో స్థానిక సర్పంచ్ ఎన్నికల నిమిత్తం నాయిని జలాల్పూర్ బీఆర్ఎస్ అభ్యర్థి లంబాడి సుశాంత్ కొంగోడు ఇండిపెండెంట్ అభ్యర్థులు దుబ్బగల స్వామి బందెల సామిల్ సర్పంచ్ బరిలో ఉన్నారు. కొంగోడులో నువ్వానేనా అంటూ ఇద్దరికీ సవాల్గా ప్రచారం చేయడం జరుగుతుంది.కొంగోడు గ్రామానికి ఇంతకు ముందు చేసిన అభివృద్ధి పనులు దానికి దీటుగా చేస్తానని ఇద్దరు గ్రామ ప్రజలలో మమేకమై హామీ ఇస్తున్నారు.ఇద్దరు ఇండిపెండెంట్ అభ్యర్థులు బందెల సామిల్ బ్యాట్ గుర్తుకు ఓటు వేయమని మరొక అభ్యర్థి దుబ్బగల స్వామి ఉంగరం వేయమని నాయిని జలాల్పూర్ సర్పంచ్ అభ్యర్థి సుశాంత్ ఉంగరం గుర్తుకు ఓటు వేయమని ప్రజలను వేడుకోవడం జరిగింది.ఈ కార్యక్రమం లో నాయకులు వేమారెడ్డి విజయభాస్కర్ రెడ్డి,సత్యనారాయణగౌడ్, కుమార్ గౌడ్ పోటీ చేస్తున్న వాడు మెంబర్లు దగ్గు దుర్గయ్య బోస్ల మంజుల కర్రె ఉషమ్మ నాయకులు నాయిని శేషగిరి దగ్గు మల్లేశం కర్రే పెద్ద సంజీవులు ఏగొండ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తప్పుల తడకగా డివిజన్ల పునర్విభజన

**సికింద్రాబాద్ :** డివిజన్ల పునర్విభజన తప్పుల తడకగా ఉన్నదని మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్ పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో తలసాని సనత్ నగర్ నియోజకవర్గ ముఖ్య నాయకులతో డీ లిమిటేషన్ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిదులను కానీ సంప్రదించకుండా ఆఫీస్ లో కూర్చొని ల్యాప్ టాప్ పెట్టుకొని గూగుల్ మ్యాప్ ద్వారా డీ లిమిటేషన్ చేసారని తెలిపారు. కనీస పరిజ్ఞానం లేకుండా సమస్యల తడకగా పునర్విభజన జరిగిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వమే గందరగోళంలో ఉందని, పరిపాలన చేయమంటే ముఖ్యమంత్రి పోయి ఫుట్బాల్ ఆడుతున్నాడని హేళన చేశారు.

## క్రిస్మస్ వేడుకలకు హజరయిన ఎమ్మెల్యే

**సికింద్రాబాద్ :** కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సోమవారం నియోజకవర్గ పరిధిలోని వార్డు 6 కాంటా బస్తీ లోని పుదు వాల్యు చర్చ్, వార్డు 2 రసూల్ పుర లోని హెవెన్ ప్యాలెస్ లలో నిర్వహించిన క్రిస్మస్ సెలబ్రేషన్స్ కు నిర్వాహకుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు . అనంతరం వేడుకలను ఉద్దేశించి ఎమ్మెల్యే శ్రీగణేష్ గారు మాట్లాడుతూ లోక రక్షకుడు ఏసుక్రీస్తు మార్గాన్ని అనుసరించి ప్రజలందరూ సేవ, త్యాగం, క్షమ, ప్రేమల గుణాలను కలిగి శాంతి, సౌభ్రాతృత్వలతో నడవాలని అన్నారు.

# హోరాహోరీగా ముగిసిన ఎన్నికల ప్రచార పర్వం




**మందమర్రి,డిసెంబర్15 (సూర్యరేఖ)** మూడో విడత గ్రామ పంచాయితీ ఎన్నికల ప్రచారం గడవు సోమవారం సాయంత్రం 6గంటలకు ముగిసింది. గత కొద్ది రోజులుగా పంచాయతీల్లో ప్రచారాన్ని హోరెత్తించిన నేతలు సైలెంట్ అయ్యారు. మండలంలోని పది గ్రామ పంచాయతీల పరిధిలో బరిలో నిలిచిన అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు.డప్పు సప్పుళ్లు,భారీ ర్యాలీతో ఇంటింటికి తిరిగి తమను గెలిపించాలని కోరారు. ఎన్నికల ఘట్టంలో ప్రచార పర్వం ముగియడంతో గ్రామాల్లో ప్రచార రథాలు మూగబోయాయి.గత వారం రోజులుగా ఆయా పార్టీల అభ్యర్థుల ప్రచార రథాలు ఉదయం నుండి సాయంత్రం వరకు ప్రచారాలతో హోరెత్తించగా ప్రచార పర్వం ముగియడంతో మైకు మోతలు నిలిచిపోయి అభ్యర్థుల ప్రచార రథాలు మూగబోయాయి.17వ తారీఖున మూడోవ విడత పోలింగ్ జరగనుండటంతో ఈ ఒక్క రోజు ఓటర్లను ప్రలోభపెట్టే వ్యూహాలకు పదును పెడుతున్నారు. తమ అభ్యర్థుల గెలుపుకు వారి మద్దతుదారులు ఈ దిశగా ఇప్పటికే గ్రామాల్లో చర్చలు పెడుతున్నారు. బుధవారం జరగనున్న పోలింగ్కు ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## మన్నాచర్చ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన క్రిస్మస్ క్యారెల్స్..




**రాజేంద్రనగర్,డిసెంబరు 15(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ మన్నాఫుల్ గాస్పెల్ చర్చ్ ఆధ్వర్యంలో సోమవారం క్రిస్మస్ క్యారెల్స్ ప్రారంభమైనాయి. చర్చ్ పాస్టర్ రెవరెండ్ సీహెచ్ జాన్ మోజెస్, సిస్టర్ సీహెచ్ ప్రభావతి,ల ఆధ్వర్యంలో క్యారెల్స్ జరిగాయి. మొదటి రోజు బుద్వేల్ బస్తీలో క్యారెల్స్ నిర్వహించారు.క్రీస్తు పుట్టుక గురించి విశ్వాసులకు, ప్రజలకు సువార్తమానము అందచేశారు. పాటలు పాడి దేవుని మహిమ పరిచారు. చిన్నారులు సంతోషంగా ఆడి పాడారు.క్రైస్తవులు తమ నివాసాలలో అందంగా క్రిస్మస్ ట్రీలను అలంకరించారు.

## విజయం సాధించిన సర్పంచులందరికి అభినందనలు

**వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి.**

**వనపర్తి :** ఎన్నికలు జరిగిన కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీ సాధించింది.ఓఎం మేఘారెడ్డి.ఆదివారం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున విజయం సాధించిన సర్పంచులకు, వార్డు సభ్యులకు, ఉపసర్పంచ్ లకు అందరికీ వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అభినందనలు. తెలియజేశారు.పలుచోట్ల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఇద్దరు బరిలో ఉండడంతో ఇతరులకు అవకాశం వచ్చిన ఆ గ్రామాల్లో ఆ ఇద్దరు వ్యక్తుల ఓట్లు గెలిచిన వ్యక్తి కంటే కాంగ్రెస్ పార్టీకే ఎక్కువ పోలయ్యాయి.అంటే గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ కే అధికంగా బలం ఉంది అని నిరూపణ అయింది.కాంగ్రెస్ పార్టీలో ఉన్న కొందరు సీనియర్ నాయకుల ప్రోత్సాహంతో పలు గ్రామాల్లో ఇద్దరు వ్యక్తులు బరిలో నిలవడంతో ఫలితాలు కొద్దిగా తగ్గిన పల్లెల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారు.ఎన్నికలు జరిగిన ఆరు మండలాలలో ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీలో విజయ్ కేతనం ఎగరవేసింది అన్నారు.

## రేవంత్ రెడ్డి పనితీరుకు పంచాయతీ ఫలితాలే నిదర్శనం

**మహబూబ్ నగర్ :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై చిన్నంబావిలో మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాకం వల్ల ఆర్థిక వ్యవస్థ చిన్నభిన్నమైందని, ధనిక రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని ధ్వజమెత్తారు. అన్ని వర్గాల ప్రజల సంతోషమే లక్ష్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. మిగిలిన హామీల్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అతి త్వరలోనే అమలు చేస్తుందన్నారు. చాలాచోట్ల ఇంకా పనులు మొదలుపెట్టాల్సి ఉందన్నారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమ, సమర్థతతో పార్టీపై, ప్రభుత్వంపై ప్రజల్లో గట్టి నమ్మకం, విశ్వాసం ఏర్పడిందనడానికి ఈ పంచాయతీ ఎన్నికల ఫలితాలే నిదర్శమని జూపల్లి పేర్కొన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో జరిగిన మొదటి, రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ కాంగ్రెస్ తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకుందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నియోజకవర్గంలో 50 చోట్ల (3 స్వతంత్రులను కలిపి) అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు గెలవగా, 28 స్థానాల్లో బీజేపీ, బీఆర్ఎస్ మద్దతు తెలిపిన అభ్యర్థులు గెలుపొందారని చెప్పారు. రెండు సంవత్సరాలలో చేసిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలు కార్యరూపం దాల్చుతున్నాయని, కొన్ని పనులు ఇంకా ప్రారంభదశలో ఉన్నాయని తెలిపారు. చిన్నంబావికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశాం. పనులకు టెండర్లు ఆహ్వానించాం. ఆర్ అండ్ బీకి రూ.200 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖ నుంచి రూ.100 కోట్లతో పనులు చేపడుతున్నాం. వాటి నుంచి చిన్నంబావి మండలం అభివృద్ధి పనులకు కేటాయించాం. ఇంకా పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభ దశలో ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మీద నమ్మకంతో ప్రజలు మేం మద్దతు తెలిపిన అభ్యర్థులు మూడింట రెండు వంతులు గెలుపొందుతూ ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారుకొల్లాపూర్ నియోజకవర్గానికి సంబంధించి పాత 4 మండలాలు కోడేరు, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్, పెంట్లవెల్లిలో 78 సర్పంచ్ స్థానాలుండగా 47 కాంగ్రెస్ కైవసం చేసుకుంది. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి పోటీ చేసినా 28 స్థానాలు నెగ్గాయి. ముగ్గురు కాంగ్రెస్ నేతలు ఛాన్స్ రాలేదని సొంతంగా పోటీచేసి విజయం సాధించారు. విత్ డ్రా చేసుకోకుండా బరిలోకి దిగి మా పార్టీ వాళ్లే నెగ్గడంతో మొత్తం 50 స్థానాలు మేం నెగ్గాం. కాంగ్రెస్ సింగిల్ గా పోటీ చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుని పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించినట్లు పేర్కొన్నారు. రెండేళ్ల పాలనకు ప్రజలు ఓటు వేసి సర్పంచులుగా గెలిపించడంపై హర్షం వ్యక్తం చేశారు. మిగతా 3 ఏళ్లలో మరిన్ని అభివృద్ధి పథకాలు అమలు చేయడంతో పాటు మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. ముగ్గురిలో ఇద్దరు కాంగ్రెస్ పార్టీని కోరుకుంటే, మిగతా ఒక్కరు బీజేపీ, బీఆర్ఎస్ లకు ఓట్లు వేశారని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

## ఈనెల 20న అయ్యప్ప స్వామి తెప్పోత్సవం

**కరీంనగర్ :** డి. సంపత్ తెప్పోత్సవ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో గత 15 సంవత్సరాలుగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న అయ్యప్ప స్వామి తెప్పోత్సవ కార్యక్రమం ఈ ఏడాది కూడా ఈనెల 20న ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరగనున్నాయని పేర్కొన్నారు. తెప్పోత్సవ దినాన మధ్యాహ్నం 1 గంటలకు అయ్యప్ప స్వాములకు మరియు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే రాత్రి 9:15 గంటలకు భక్తులకు అల్పాహారం అందించనున్నట్లు వెల్లడించారు. అయ్యప్ప స్వాములు, భక్తులు కుటుంబ సమేతంగా హాజరై స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించి అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కావాలని కమిటీ చైర్మన్ డి. సంపత్ పిలుపునిచ్చారు. ఈ తెప్పోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా సాయంత్రం 7:15 గంటలకు గోమాతతో కలిసి అయ్యప్ప స్వామి దేవాలయం చుట్టూ ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం గోమాతకు అయ్యప్ప స్వాములు మహిళలు కలిసి మహారతి ఇవ్వనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం భక్తుల్లో విశేష ఉత్సాహాన్ని నింపుతుందని నిర్వాహకులు తెలిపారు.

# నిర్వాహకుల నిర్లక్ష్యం రోడ్లపైనే గోనే సంచులు





**నిజాంపేట,డిసెంబర్15(సూర్యరేఖ)** మండలం రజాక్ పల్లి,కాసింపూర్,గ్రామ శివారులో గల వరి కొనుగోలు కేంద్రం నిర్వాహకుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది.వరి కొనుగోలు కేంద్రాలు ముగిసిపోయి రెండు నెలలు గడుస్తున్నా,వరి ధాన్యాన్ని కొనుగోలు చేసే గోనె సంచులు,తూకం వేసే కాంటాను రోడ్డుపైనే వదిలిపెట్టారు.దీంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.వేలు ఖర్చుపెట్టి ప్రభుత్వం గోనే సంచులు కొనుగోలు చేసి రైతులకు అందిస్తుంటే నిర్వాహకులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్నటువంటి గోనే సంచులను తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని రైతులు అంటున్నారు.

## గెలిచిన ఓడిన ప్రజల మధ్యనే ఉంటా...

**బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్**



**నిజాంపేట,డిసెంబర్15 (సూర్యరేఖ)** ఎన్నికల్లో గెలుపోటములు సహజమని గెలిచినా ఓడిన ప్రజల మధ్య ఉంటానని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు.గెలిచినా ఓడినా ప్రజల యోగక్షేమాలే పరమాధిగా పనిచేస్తామని ఆయన వెల్లడించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీలకు ప్రజల వైపు ఉండాలనే సూత్రీకరణకు అనుగుణంగా తాము ఉంటామన్నారు.

## ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవం





**నిజాంపేట,డిసెంబర్15(సూర్యరేఖ)** మండల కేంద్రంలో సోమవారం అయ్యప్ప ఆలయ ఆవరణలో గదస్వామి బజార్ నరేష్ గౌడ్ అయ్యప్ప మహాపడిపూజ మహోత్సవ కార్యక్రమాన్ని గురుస్వామి బజార్ రంజిత్ గౌడ్, వీరమల్లు బాలకృష్ణ,యాదగౌడ్,ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వాముల భజన సంకీర్తనలతో గ్రామంలో కొత్త శోభ సంతరించుకుంది. ఈ పడిపూజ మహోత్సవానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాతులయ్యారు.ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ.. పదిమందితో మొదలైన అయ్యప్ప స్వామి మాలాధారణ నేడు 50మంది స్వామి మాల ధారణ వేసుకోవడం జరిగిందని,అతి త్వరలో దాతలు మరియు గ్రామస్తుల సహకారంతో ఆలయ నిర్మాణానికి కంకణ బద్ధులమవుతామని తెలిపారు.అనంతరం అయ్యప్ప స్వాములు అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో నిజాంపేట నస్కల్, కల్వకుంట, అయ్యప్పస్వాములు తదితరులు పాల్గొన్నారు.

## డీలిమిటేషన్ను బేషరతుగా ఉపసంహరించుకోవాలని శ్రీకాంత్ డిమాండ్..



**నాంపల్లి,హైద్రాబాద్,డిసెంబర్15(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిలిమిటేషన్ ప్రక్రియను చూస్తుంటే,ఇది రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చేసినట్లు అనిపించడం లేదని, డిలిమిటేషన్ ప్రక్రియ పూర్తిగా దారుసలాం వేదికగా మజ్లీస్ పార్టీ విడుదల చేసినట్టుగా అనిపిస్తుందని భారతీయ జనత పార్టీ కార్వాన్ నియోజకవర్గం లంగర్ హౌస్ డివిజన్ అధ్యక్షులు డి.శ్రీకాంత్ ఆగ్రహం వ్యక్తం చేసారు.ఈ విషయమై లంగర్ హౌస్ డివిజన్ బీజేపీ నేతలతో జిహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ మర్యాదపూర్వకంగా కలసి డీలిమిటేషన్ ను బేషరతుగా ఉపసంహరించుకోవాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. అసెంబ్లీ వారీగా డివిజన్లలో పెరిగిన జనాభా లెక్కలు పరిగణనలోకి తీసుకోకుండా విభజన జరగలేదనే విషయం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.పూర్తిగా ఆశాస్త్రీయ పద్ధతిలో రానున్న రోజుల్లో ఒకవర్గం వారిని గ్రేటర్ హైదరాబాద్ నగరం నుండి వెళ్లిపోయే పరిస్థితి తేవాలని ఎంఐఎం పార్టీ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తూ,డీలిమిటేషన్ను బేషరతుగా ఉపసంహరించుకోవాలని కోరారు.డిప్యూటీ కమిషనర్ కలిసిన వారిలో సీనియర్ నాయకులు ఉదయ్ కుమార్, నరసింహారెడ్డి,నాగేంద్ర ప్రకాష్ రెడ్డి,ఆమంచి శ్రీకాంత్,మనోజ్ లు కలవడం జరిగింది.

## గ్రామ అభివృద్ధి కోసం పనిచేస్తా

**ఘనంగా విజయోత్సవ ర్యాలీ...**

**గ్రామ సర్పంచ్ చలిమేటి నరేందర్**



**నిజాంపేట,డిసెంబర్15(సూర్యరేఖ)** గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం పనిచేస్తానని నిజాంపేట గ్రామ సర్పంచ్ చలమేటి నరేందర్ అన్నారు.గ్రామపంచాయతీ రెండో విడత ఎన్నికల్లో భాగంగా గ్రామ సర్పంచ్ గా బిజెపి అభ్యర్థి చలిమేటి.నరేందర్,కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై 459 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.సోమవారం నిజాంపేటలో సర్పంచ్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా నరేందర్ ను గ్రామంలో పలువురు శాలువతో ఘనంగా సన్మానించారు.గ్రామ ప్రజల అభివృద్ధి, పారదర్శక పాలనతో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో పరదర్శకంగా వ్యవహారిస్తానని ఈ విజయం తన వ్యక్తిగత గెలుపు కాదని,నిజాంపేట ప్రజల విశ్వాసానికి ప్రతీక మాత్రమేనని గ్రామ ప్రజల విశ్వాసానికి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. సమస్యల పరిష్కారానికి అందరి సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. తనకు ఓటేసి గెలిపించిన గ్రామ ప్రజలకు,తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ ర్యాలీలో ఉప్ప సర్పంచ్ గేరిగంటి బాబు,వార్డ్ సభ్యులు ప్రశాంత్,ఎల్లం,కిషోర్, దుర్గయ్య,మల్లేశం,నాయిని లక్ష్మణ్,యండి.నసీమ మిర్జా,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న ఉప్పల్ రజిత పరమేశ్వర్ రెడ్డి..



**ఉప్పల్,,డిసెంబర్15 (సూర్యరేఖ)** ఉప్పల్ చర్చి పాస్టర్స్ అసోసియేషన్ అద్వర్యంలో జరుగుతున్న క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యఅతిథులుగా పాల్గొని క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని,క్రిస్మస్ పండుగతో ప్రతి ఇంటా శాంతి సౌభాగ్యాలు నెల కొనాలని ఆకాక్షించారు. ఏసు ప్రభువును కొలుస్తూ భక్తులు ఆలాపించిన దైవభక్తి గీతాలు,కీర్తనలు అలరించాయి.ఈ సందర్భంగా పాస్టర్లు ఏసుక్రీస్తు జన్మదిన విశిష్టతను వివరించారు.ఈ కార్యక్రమంలో చైర్మెన్ గోనె పిలిప్స్,అధ్యక్షులు అశోక్ రాతి,అగ్రిఫ,సల్లా ప్రభాకర్ రెడ్డి,వసంత్ కుమార్,జెసిడిపల్లి యోహాన్,డెన్డు జాకబ్, టి.చంద్రపాల్,టెంజోనియా,టీ. రోకేష్,దేవదాస్,డేవిడ్ సన్,రాజు,రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఎంటినగర్ పెద్ద చెరువులో గుర్రపు డెక్క తొలగింపు కార్యక్రమాన్ని పర్యవేక్షించిన కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్



**ఉప్పల్,డిసెంబర్15(సూర్యరేఖ)** నాచారంలో దోమలు విపరీతంగా పెరగడంతో సోమవారం కార్పొరేటర్ ఎంటమాలజీ సిబ్బందితో కలిసి హెచ్ఎంటి నగర్ పెద్ద చెరువును పర్యవేక్షించారు.ఈ సందర్భంగా హెచ్ఎంటినగర్ పెద్ద చెరువులో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిందని ఈ మధ్యకాలంలో దోమలు చాలా పెరిగాయని తక్షణమే గుర్రపు డెక్క తొలగించే మిషన్ ఏర్పాటు చేసి గుర్రపుడెక్క పూర్తిగా తొలగించాలని ఎస్.ఈ. ఎంటమాలజీ మాధవరెడ్డిని ఫోన్ లో నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ సూచించారు.త్వరలోనే ఎప్టిసి మిషన్ తెప్పిస్తామని ఎస్ఈ.ఎంటమాలజీ మాధవరెడ్డి హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ సూపర్వైజర్ నరసింహ, బీఆర్ఎస్ నాయకులు కట్ట బుచ్చన్నగౌడ్,చంద్రశేఖర్,దాసరి కర్ణ,మక్బూల్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి..

**మంత్రి వివేక్ వెంకటస్వామి**



**చెన్నూర్,డిసెంబర్15(సూర్యరేఖ)** భీమారంలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని మంత్రి వివేక్ ప్రజలను కోరారు. సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ..భీమారం అభివృద్ధికి అధిక నిధులను కేటాయిస్తానని హామీ ఇచ్చారు.రోడ్లు,దోబీ ఘాట్ నిర్మాణాలు చేపడతామని తెలిపారు.భీమారంలో అభివృద్ధి జరగాలంటే పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను కోరారు.

## మధుయాష్కిగౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గడ్డం రవికుమార్

**ఉప్పల్,డిసెంబర్15(సూర్యరేఖ)** టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్,మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ జన్మదినోత్సవం సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు,మాజీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, యువ కాపునాడు ఉపాధ్యక్షులు గడ్డం రవికుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా గడ్డం రవికుమార్ మాట్లాడుతూ...ఆయనకు మంచి ఆరోగ్యం,ఆనందం మరియు సుదీర్ఘ జీవితం కలగాలని కోరుకుంటున్నాము.ఆయన ప్రజలకు మరింత సేవ చేయాలని,ఆయన మార్గదర్శకత్వం ఎల్లప్పుడూ ఉండాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.



# ప్రజా సమస్యలు పరిష్కరించాలని డీసికి వినతిపత్రం అందజేసిన ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు




**ఉప్పల్,డిసెంబర్15 (సూర్యరేఖ)** ప్రజా సమస్యలను పరిష్కరించాలని ప్రజావాణి కార్యక్రమంలో ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు సోమవారం డిప్యూటీ కమిషనర్ కి వినతి పత్రం అందజేశారు.జిహెచ్ఎంసి ఉప్పల్ సర్కిల్ నందు రామంతపూర్,భగాయత్ లో సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద గల రామంతపూర్ వైపు ఉన్న సర్వీస్ రోడ్డును పూర్తి నిర్మాణం చేపట్టాలని, హెచ్ఎండిఏ భగాయత్ శిల్పారామం వైపు గుర్తు తెలియని వాహనాలు రాత్రి వేళల్లో యదేచ్ఛగా మట్టిని డంపింగ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని కెసిఆర్ నగర్ నుండి నాగోల్ మెట్రో స్టేషన్ వరకు వెళ్లే సర్వీస్ రోడ్డు నందు రోడ్డు చాలా పాడైపోయి గుంతల మయమ అయిందని,రోడ్డు నిర్మాణం కొరకు తవ్విన రోడ్డును వదిలివేశారని వివరించారు.ఆ రోడ్డును త్వరగా పూర్తి చేయాలని సర్వీస్ రోడ్డు నందు టీవీ కాలనీ వద్ద రోడ్డు మధ్యలో క్రాసింగ్ ఉన్నచోట రెండు చెట్లు ఉన్నాయని వాటిని తీసి వేరే చోట నాటాలని విజ్ఞప్తి చేశారు.అదే సర్వీస్ రోడ్డు నందు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కొరకు రోడ్డున త్రవ్వి చాలా కాలం అవుతుందని వర్కు పూర్తి చేయకపోవడంతో దారి లో వచ్చే కొన్ని వేల వాహనాలకు ఇబ్బందికరంగా మారిందన్నారు.భగాయత్ డిమార్ట్ వద్ద ఉన్న రోడ్డు చాలా పాడైపోయినదని రామంతాపూర్ నందు అనేక ప్రాంతాలలో జలమండలి అధికారులు మరియు జిహెచ్ఎంసి అధికారులు అవసర నిమిత్తం రోడ్డున తవ్వి వదిలేసారని ఇలాంటి స్థలాలు కొన్ని వందల సంఖ్యలో ఉంటాయి.వాటిని వెంటనే బాగు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్, కార్యదర్శి కోసుల విజయకుమార్,ఉపాధ్యక్షులు గోలీ కృష్ణయ్య, అంబార్పే శివశంకర్ గౌడ్,సిద్ధ గొని రాజుగౌడ్ పాల్గొన్నారు.

# సులోచన కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సహాయాన్ని అందజేసిన ఉప్పల్ పోలీస్ స్టేషన్ సిఐ భాస్కర్





**ఉప్పల్,డిసెంబర్15(సూర్యరేఖ)** ఉప్పల్ పోలీస్ స్టేషన్ లో గత కొన్ని సంవత్సరాలుగా జిఎంఆర్ సంస్థ తరపున విధులు నిర్వహిస్తున్న సులోచన భర్త రవీందర్ అనారోగ్య కారణం వల్ల మరణించడం జరిగింది.అతని పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ అతని మృతికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి కుటుంబానికి అండగా నిలుస్తూ ఉప్పల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది వారి కుటుంబానికి సహాయం చేయడం జరిగింది రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని ఉప్పల్ సిఐ(ఎస్ హెచ్ ఓ)భాస్కర్ సులోచనకు అందజేశారు. కార్యక్రమంలో ఉప్పల్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ రామలింగారెడ్డి,అడ్మిన్ ఎస్ఐ మాధవరెడ్డి,ఎస్సైలు వినయ్,చాడ సమతా రెడ్డి,ఏ.ఎస్.ఐ.వెంకట్ రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రామంతపూర్ లో సర్దార్ వల్లభాయ్ పటేల్ కి ఘన నివాళులు అర్పించిన నేతలు






**ఉప్పల్,డిసెంబర్15(సూర్యరేఖ)** రామాంతపూర్ డివిజన్ అధ్యక్షులు వంగాల సంతోష్ గుప్తా ఆధ్వర్యంలో రామంతపూర్ హెూమియోపతి హాస్పటల్ వద్ద స్వతంత్ర సంగ్రామంలో అసమాన త్యాగాలు చేసిన సమరయోధుడు,నిజం మెడలు వంచి హైదరాబాద్ సంస్థానాన్ని విముక్తం చేసిన ధీరోదాత్తుడు,భారత తొలి ఉపప్రధానిగా విశేష సేవలందించిన రాజనీతిజ్ఞుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ఆ మహానీయుడి విగ్రహానికి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్,బిజెపి సీనియర్ నాయకులు తిండేరు హనుమంతరావు,ముత్తినేని జగదీష్,తాళ్ల బాలకృష్ణగౌడ్,వల్లపు జగన్ యాదవ్,వెంపటి శ్రీనివాస్,దర్శనల సుధాకర్,శైలేందర్,పలుగుల అంజయ్యపటేల్,మహేశ్వర్ రెడ్డి,ఉపేందర్ యాదవ్,తమ్మలిరవి,బొడ్డుపల్లి ఆనంద్,వెంపటి రామ్ రాజ్,మురళి,సురేష్,తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...దేశ ప్రయోజనాల విషయంలో ఎవరైనా సరే..ఎలాంటి పరిస్థితులకూ లొంగకుండా ఉక్కు సంకల్పంతో ముందుకెళ్లాలని మార్గదర్శనం చేసిన గొప్ప నాయకుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు.ఆయన దేశంలో గొప్ప నాయకుడని ఆయన చరిత్రను అణచివేయడానికి గత ప్రభుత్వాలు ఎంతో ప్రయత్నాలు చేసినా విఫలమయ్యారని ఆరోపించారు.

# డ్రగ్ అవగాహన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎంఈఓ రామారావు

**ఉప్పల్,డిసెంబర్15 (సూర్యరేఖ)** ఉప్పల్ టీఆర్ ఎస్ఎంఏ అధ్యక్షులు విజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమగ్ర డ్రగ్ అవగాహన ప్రచారం పోస్టర్‌ను ఉప్పల్ మండల విద్యాధికారి (ఎంఈఓ) రామారావు సోమవారంసోమవారం అధికారికంగా ఆవిష్కరించారు.విద్యార్థులు మరియు సమాజానికి డ్రగ్ దుర్వినియోగం వల్ల కలిగే హానికర ప్రభావాలు,ఆరోగ్యకరమైన క్రమశిక్షణతో కూడిన జీవన విధానం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎంఈఓ రామారావు మాట్లాడుతూ...డ్రగ్ వ్యసనం విద్యార్థుల భవిష్యత్తుకు,సమాజానికి తీవ్రమైన ముప్పు అని హెచ్చరించారు.పిల్లలను సరైన దారిలో నడిపించేందుకు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు సమిష్టిగా పనిచేయాలని,పాఠశాలల పరిసరాల్లో డ్రగ్‌రహిత సురక్షిత వాతావరణం ఏర్పాటుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.అలాగే ప్రైవేట్ పాఠశాలలు అన్ని భద్రతా మరియు సెక్యూరిటీ చర్యలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.ఈ ప్రచారంలో "డ్రగ్స్‌కునో చెప్పండి జీవితానికి యెస్ చెప్పండి"వంటి ముఖ్య సందేశాలను ప్రాధాన్యంగా తీసుకుని,యువతలో నివారణాత్మక విద్య,నైతిక విలువలు,అవగాహన పెంపొందించడంపై దృష్టి సారించారు. ఉపాధ్యాయులు,పాఠశాల యాజమాన్యాలు చురుకుగా పాల్గొని,అవగాహన విస్తరించేందుకు మరియు విద్యార్థుల శ్రేయస్సును పర్యవేక్షించేందుకు తమ మద్దతు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో 150కు పైగా పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.




## లచ్చమ్మగూడెం గ్రామ పంచాయితి సర్పంచ్ గా జక్కలి రాజుయాదవ్ గెలిపించండి..



**నాంపల్లి,హైద్రాబాద్,డిసెంబర్15(సూర్యరేఖ)** మునుగోడు అసెంబ్లీ లచ్చమ్మగూడెం గ్రామ పంచాయితి ఎన్నికలలో బిజెపి,ఎంఆర్ పిఎస్ బలపరిచిన గ్రామ సర్పంచ్ అభ్యర్థి జక్కలి రాజు యాదవ్ కు మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించండి యని కోరుతూ బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వరయాదవ్,బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్,బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు గొంగళ్ళ మహేష్,బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యాలయ సహకార్యదర్శి ప్రభు పూజారి,హనుమకొండ జిల్లా వరంగల్ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ కె.సత్యనారాయణ బృందం ప్రచారంలో పాల్గొనడం జరిగింది.సర్పంచ్ అభ్యర్థి జక్కలి రాజుయాదవ్ మాట్లాడుతూ. సర్పంచ్ గా తనను గెలిపిస్తే గ్రామానికి సేవకుడిగా ఉంటూ ప్రజల పక్షాన ప్రభుత్వంతో పోరాడైన గ్రామాన్ని అభివృద్ధి చేస్తూ,ప్రజా సమస్యల పరిష్కారం కొరకు పనిచేస్తనన్నారు.

## ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ కుమార్ దీపక్..



**చెన్నూర్,డిసెంబర్15(సూర్యరేఖ)**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ జైపూర్ మండల కేంద్రంలోని జెడ్ పిహెచ్ స్ స్కూల్ నందు సోమవారం 3వ విడుత సాధారణ ఎన్నికలలో భాగంగా ఎన్నికల ఏర్పాట్లును పరిశీలించడం జరిగింది.బ్యాలెట్ పేపర్ లను జాగ్రత్త పరిశీంచాలని, భోజన వసతి,ఏర్పాట్లులో ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలని ఆదేశించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ ఎంపీవో శ్రీపతి బాపురావు ఏఈ పిఆర్ రాజకుమార్,సిబ్బంది పాల్గొన్నారు

## రేపు ఆయుర్వేద వైద్య శిబిరం..



**మందమర్రి,డిసెంబర్15(సూర్యరేఖ)** మాతా రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద, హైదరాబాద్ కు చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యులు విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో 17వ తారీఖు (బుధవారం)ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సింగరేణి యాజమాన్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.సింగరేణి ఉద్యోగులు,వారి కుటుంబ సభ్యులతో పాటు పరిసర ప్రాంత వాసుల ఆరోగ్య సౌకర్యార్థం ఈ నెల 17వ తారీఖున బుధవారం ఏరియాలోని సీఈఆర్ క్లబ్ లో ఉదయం10 నుండి సాయంత్రం6గంటల వరకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.కీళ్లు,మోకాళ్ల నొప్పులు,బిపి,షుగర్, పక్షవాతం అజీర్ణం మలబద్ధకం అస్తమా స్త్రీ సంబంధిత దీర్ఘకాలిక వ్యాధులకు (మాతా రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద,హైదరాబాద్) ఆయుర్వేద వైద్యులు విశ్వనాథ మహర్షి సౌజన్యంతో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని,ఈ వైద్య శిబిరానికి ఇంతకు మునుపు హాజరైన వారు,కొత్తగా వైద్యం కోసం వచ్చే వారు అందరూ హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## ప్రజల కోసం పనిచేసే వారిని గెలిపించండి

**యజ్ఞ నారాయణపురం టీడీపీ,బీఆర్ఎస్ అభ్యర్థి కంచపోగు సుజాత**



**ఖమ్మం,డిసెంబర్15(సూర్యరేఖ) :** కల్లూరు మండల పరిధిలోని యజ్ఞ నారాయణపురం తెలుగుదేశం బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి కంచపోగు సుజాత ప్రచారాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు.ఆమెకు కేటాయించిన ఎన్నికల గుర్తు ఉంగరంపై ప్రజలు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని గ్రామ ప్రజలను కోరారు.ఈ గ్రామపంచాయతీని అభివృద్ధి చేసింది బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించి ఈ గ్రామాన్ని జిల్లాస్థాయిలో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానినన తెలిపారు.

# అధికారులు,సిబ్బంది సకాలంలో పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలి

**జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల,డిసెంబర్15(సూర్యరేఖ)** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఈ నెల17వ తేదీన జరగనున్న 3వ విడత పోలింగ్ నిర్వహణ కొరకు విధులు నిర్వహించే అధికారులు,సిబ్బంది వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జిల్లాలోని కోటపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,చెన్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల,భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జైపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,మందమర్రి మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల-జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 3వ విడత ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలను ఆయా మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా జరిగేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని,ఓటింగ్,కౌంటింగ్ కొరకు అవసరమైన సామాగ్రి పంపిణీ చేయడంతో పాటు ఎన్నికల అధికారులు,సిబ్బందిని నియమించడం జరిగిందని తెలిపారు.ఈ నెల16వ తేదీన అధికారులు నిర్దేశిత సమయానికి తమకు కేటాయించిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలలో రిపోర్టు చేయాలని,ఆయా పోలింగ్ కేంద్రాల వారిగా కేటాయించిన ఎన్నికల సామాగ్రి





పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.3వ విడతలో భాగంగా ఈ నెల17వ తేదీన జిల్లాలోని చెన్నూర్,కోటపల్లి, భీమారం,జైపూర్,మందమర్రి మండలాలలో గ్రామపంచాయతీ సర్పంచ్,వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్,పోలింగ్ సిబ్బంది,సూక్ష్మ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించడం జరుగుతుందని, ఈ నెల 17వ తేదీన ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం 2 గంటల నుండి కౌంటింగ్ జరుగుతుందని తెలిపారు.అర్హత గల ప్రతి ఒక్కరూ నిర్భయంగా నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కు వినియోగించాలని అధికారులు మీడియా ప్రతినిధులు అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పారదర్శకమైన ఎన్నికలు జరిగేలా అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని తెలిపారు. అనంతరం కోటపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్రాగునీరు,విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు సౌచాలయాలు, వంటశాల, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత,రిజిస్టర్ లను పరిశీలించారు. విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని,ఈ క్రమంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించడంతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందిస్తూ వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని,తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సౌకర్యార్థం తపాలాశాఖ ఉపకార్యాలయం ఏర్పాటు





**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల,డిసెంబర్15(సూర్యరేఖ)** జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ప్రజల సౌకర్యార్థం తపాలాశాఖ ఉపకార్యాలయం ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.సోమవారం కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్,తపాలాశాఖ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్స్ ఆర్ రామారావు సబ్ పోస్ట్ మాస్టర్ వి.రవి,టి. ప్రణబ్,లతో కలిసి తపాలాశాఖ ఉప కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రజల సౌకర్యార్థం సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో సబ్ పోస్ట్ ఆఫీస్ ఏర్పాటు చేయడం జరిగిందని,ఈ కార్యాలయం ద్వారా పొదుపు ఖాతాలు,స్పీడ్ పోస్ట్,రిజిస్టర్ పోస్ట్, పార్సిల్ సేవ,జీవిత భీమా,ఆర్.డి.,సుకన్య సమృద్ధి, టైం డిపాజిట్,పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్,మంత్లీ ఇన్కమ్ స్కీం,సీనియర్ సిటిజన్,నిసాన్ వికాస్ పాత్ర,ఇతర అన్ని తపాలా సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ కుర్చీ కోసం రాలేదు,మన ఊరి కోసం వచ్చాను








**తలొంచి సమస్య వింట తలెత్తుకునేలా అభివృద్ధి చేస్తా..**

**ఆశతో కాకుండా..ఆశయంతో మన భీమారం గ్రామాభివృద్ధికై**

**అనునిత్యం అందుబాటులో ఉంటా**

**భీమారం సర్పంచ్ అభ్యర్థి ఉప్పమల్ల విజయలక్ష్మి పున్నంచంద్**

**చెన్నూర్,డిసెంబర్15(సూర్యరేఖ)** భీమారం గ్రామ సర్పంచ్ గా తనను గెలిపించాలని, ఉంగరం గుర్తుకు ఓటు వేయాలని సర్పంచ్ అభ్యర్థి ఉప్పమల్ల విజయలక్ష్మి పున్నంచంద్ భీమారం ప్రజలను కోరారు.సోమవారం గ్రామంలో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ. భీమారం సర్పంచ్ గా తనకు అవకాశం ఇవ్వాలని,గ్రామాన్ని అభివృద్ధి బాటలు నడిపిస్తానని తెలిపారు. గ్రామంలో నెల కొన్న సమస్యలను పరిష్కరించి గ్రామంలో వ్యవసాయం, తాగు నీరు,పచ్చదనం పరిశుభ్రత,విద్యుత్ దీపాలు, మురికి కాలువల నిర్మాణం,సీసీ రోడ్ల నిర్మాణం చేసి గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని పేర్కొన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను సైతం అర్హులైన పేదలకు అందేలా తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అంతే కాకుండా గ్రామంలో అర్హులైన వారికి పింఛన్లు అందేవిధంగా కృషి చేస్తానన్నారు.సర్పంచ్ కుర్చీ కోసం తన ఆరాటం కాదని ఊరు అభివృద్ధి కోసమే తన పోరాటమన్నారు.రింగు గుర్తుకు ఓటు వేసి తనను అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

## ఆశీర్వదిస్తే అభివృద్ధి చేస్తా

**లింగగూడెం సర్పంచ్ అభ్యర్థి సామ్రాజ్యం**



**ఖమ్మం,డిసెంబర్15(సూర్యరేఖ) :** పెనుబల్లి మండల పరిధిలోని లింగగూడెం గ్రామపంచాయతీ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన తనకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థి తైలం సామ్రాజ్యం సురేష్ అన్నారు.తనకు కేటాయించిన గుర్తు ఉంగరం అని,ఓటు వేసి తమకు ఒక్కసారి లింగగూడెం సర్పంచ్ అవకాశం ఇవ్వాలన్నారు.గ్రామపంచాయతీని రాష్ట్రస్థాయిలో అభివృద్ధి చేస్తానని గ్రామపంచాయతీ ప్రజలు తనను ఆశీర్వదించాలని,ఎన్నికల గుర్తు ఉంగరంపై మీ పవిత్రమైన ఓటు ముద్ర వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు.తాము ప్రజల మధ్య ప్రజలతో ఉండి ప్రజల కోసం నిత్యం సేవలందించే తమకు అవకాశం ఇవ్వాలని కోరారు.

## గ్రామపంచాయతీ అభివృద్ధికై ఎల్లవేళలా కృషి చేస్తా

**రత్నకుమారి**



**ఖమ్మం,డిసెంబర్15(సూర్యరేఖ) :** పెనుబల్లి మండలం లింగగూడెం గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి బద్దం రత్నకుమారి ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు.ఆమెకు కేటాయించిన గుర్తు బ్యాట్ కు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామంలో ఉన్న సమస్యలన్నీ సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ దృష్టికి తీసుకెళ్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు సహకారంతో గ్రామపంచాయతీ అభివృద్ధి చేస్తానని గ్రామ ప్రజలకు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చీకటి రామారావు,చీకటి చిన్న నరసింహారావు,విష్ణుపల్లి ప్రభాకర్,చీకటి అజిత్ కుమార్,గ్రామ ప్రజలు పాల్గొని ప్రచారం నిర్వహించారు.

## సి ఎండి ఎన్.బలరాం చేతుల మీదుగా క్యాలండర్ ఆవిష్కరణ..

**సంఘం చేపడుతున్న కార్యక్రమాలను ప్రతిబింబించేలా క్యాలండర్**



**మందమర్రి,డిసెంబర్15(సూర్యరేఖ)** సంఘం చేపడుతున్న కార్యక్రమాలను ప్రతిబింబించేలా దక్షిణ ఇండియా సంఘం(సిఎస్ఐ) ఆధ్వర్యంలో ప్రచురించిన 2026నూతన సంవత్సరం క్యాలెండర్ను సోమవారం సింగరేణి భవన్లో సింగరేణి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం నాయక్ చేతుల మీదుగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సిఎస్ఐ సంఘం సామాజిక సేవలు,ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా సమాజానికి విలువైన సేవలందిస్తోందని ప్రశంసించారు.నూతన సంవత్సరం క్యాలెండర్ ప్రజలకు ఆధ్యాత్మిక ప్రేరణనిచ్చేలా రూపొందించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మందమర్రి ప్రాంతానికి చెందిన సిఎస్ఐ కమిటీ సభ్యులు పేరం రాజశేఖర్, సంజయ్‌తో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై వేధిస్తున్న భర్తను చంపిన భార్య..



**మందమర్రి,డిసెంబర్15(సూర్యరేఖ)** మద్యానికి బానిసై భార్య పిల్లలను అనునిత్యం వేధిస్తుండడంతో విసిగివేసారి ఆవేశానికి గురైన భార్య తన భర్తపై స్టీల్ రాడ్ తో దాడి చేయడంతో భర్త అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పట్టణంలోని రాజీవ్ నగర్ లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని రాజీవ్ నగర్ లో నివాసముండే లారీ డ్రైవర్ మాటేటి చంద్రయ్య (50)తరచూ మద్యం సేవిస్తూ మద్యం మత్తులో భార్య, కూతురులను ప్రతి నిత్యం కొట్టడంతో ఆవేశానికి గురైన భార్య మాటెటి లక్ష్మీ స్టీల్ రాడ్ తో తలపై బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై చంద్రయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.సంఘటన స్థలాన్ని పట్టణ సీఐ కె.శశిధర్ రెడ్డి,ఎస్సై రాజశేఖర్,లు సందర్శించి మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి శవ పంచనామా నిర్వహించారు.మృతుని సోదరి దూడం లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శశిధర్ రెడ్డి తెలిపారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ కు ఘనంగా నివాళులర్పించిన కార్పొరేటర్లు కక్కిరేణి చేతన హరీష్,బండారు శ్రీవాణి వెంకటరావు




**ఉప్పల్,డిసెంబర్15 (సూర్యరేఖ)**భారత ఐక్యత సమగ్రతకు కృషిచేసిన ఐక్యతమూర్తి, భారత తొలి ఉపప్రధాని,భారతరత్న ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా రామంతపూర్ ప్రధాన రహదారిలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్,రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు,లు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ...దేశం కోసం ఆయన చేసిన అపూర్వమైన త్యాగాలు అవిశ్రాంత స్మరించుకుంటూ సేవలను ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.భారత స్వాతంత్ర్యానంతరం 5005 పైగా స్వదేశీ సంస్థానాలను భారత యూనియన్ విలీనం చేయడంలో ఆయన ప్రదర్శించిన దార్శనికత, ధైర్యసాహసాలు చిరస్మరణీయమైనవి,ఆయన ఆత్మ శాంతి కలగాలని కోరుకుంటూ,దేశ నిర్మాణంలో ఆయన పోషించిన కీలక పాత్రను కొనియాడారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మాజీ కౌన్సిలర్ తిండేరు హనుమంతరావు,హబ్సిగూడ ప్రధాన కార్యదర్శులు చెల్లోజు ఎల్లాచారి,చింతకింది ప్రవీణ్,గడ్డం సాయికిరణ్,బండి పద్మ,దారం వెంకటేష్ గుప్త,పీసరి శంకర్,పుచ్చుల అశోక్,జి. హరిబాబు నందికంటి శివ,గడ్డం వెంకట్ సాయి, తుమ్మలి రవి,తోట శ్రీనివాస్,గుర్రం మహేష్, రామంతపూర్ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ గుప్తా తాల్ల బాలకృష్ణగౌడ్,మత్తినేని జగదీష్,వల్లపు జగన్ యాదవ్,ఎంపటి శ్రీనివాస్,పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి పలుగుల అంజయ్య,దర్శనాల సుధాకర్,ఉపేందర్ ఆనంద్,తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి,కన్నాల బస్తీలో క్షయ రహిత భారత్ వైద్య శిబిరం





**బెల్లంపల్లి,డిసెంబర్15(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల బస్తీలో ప్రధాన మంత్రి క్షయ రహిత భారత్ కార్యక్రమం కింద వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరాన్ని జిల్లా క్షయ నివారణ అధికారి సుధాకర్ నాయక్,స్థానిక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సుచరిత పర్యవేక్షించారు. శిబిరానికి హాజరైన రోగులు స్థానిక ప్రజలతో వారు మాట్లాడి క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. రెండు వారాలకు పైగా దగ్గు లక్షణాలు కొనసాగితే క్షయ వ్యాధిగా అనుమానించాల్సిన అవసరం ఉందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో క్షయ వ్యాధి నిర్ధారణకు అవసరమైన పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా పూర్తిస్థాయి చికిత్స అందించడంతో పాటు, చికిత్స పూర్తయ్యే వరకు ప్రతినెల వెయ్యి రూపాయల చొప్పున పోషణ భత్యాన్ని ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఈ వ్యాధి త్వరగా వ్యాపించే అవకాశం ఉంటుందని అందుకే పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.తుమ్ము, దగ్గు ద్వారా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే ఈ వ్యాధి మద్యం సేవించే వారికి,పొగాకు నమిలే వారికి ఎక్కువ ప్రమాదకరమని తెలిపారు. సత్వరంగా వ్యాధి నిర్ధారణ చేసి చికిత్స ప్రారంభిస్తే వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని అన్నారు.ఈ వైద్య శిబిరంలో అవసరం ఉన్నవారికి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.ఎక్స్‌రే అవసరం ఉన్న ఎనభై రెండు మందికి ఇంటి వద్దనే చలించు ఎక్స్‌రే యంత్రం ద్వారా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యక్రమ సమన్వయకర్త సురేందర్,క్షయ వ్యాధి పర్యవేక్షకుడు శశికాంత్ క్షయ ఆరోగ్య సందర్శకుడు వెంకటేష్ సహాయక నర్సు రుబియ, ఆశకార్యకర్తలు పాల్గొని సేవలందించారు.

# ప్రతి ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలి







రక్షణ కమిటీ కన్వీనర్ ఆర్.విజయ ప్రసాద్

**మందమర్రి,డిసెంబర్15(సూర్యరేఖ)**సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగి రక్షణలో భాగస్వామి కావాలని రక్షణ కమిటీ కన్వీనర్, జిఎం(ఎంఎస్) కార్పొరేట్ ఆర్.విజయ ప్రసాద్ అన్నారు.సోమవారం 56వ రక్షణ పక్షోత్సవాలలో భాగంగా తనిఖీ బృందం సభ్యులైన సేఫ్టీ కమిటీ కన్వీనర్ ఆర్.విజయ ప్రసాద్,జిఎం (ఎం ఎస్)కార్పొరేట్,మందమర్రి ఏరియ జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ కేకే 5గనిని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అధికారులు ఇచ్చిన సేఫ్టీ ఆపరేషన్ సూచనలను తప్పనిసరిగా పాటించాలని,దీనివల్ల ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయని,తద్వార సంస్థకి,దేశ భవిష్యత్తుకి మంచి పేరు వస్తుందని వారు అన్నారు. సంస్థ మనుగడ ఉండాలి అంటే వందశాతం పనిగంటలను ప్రతి ఉద్యోగి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.అనంతరం మందమర్రి ఏరియ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ...రక్షణ కోసం ఉద్యోగులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేసిన రక్షణ పరికరాలను పనిముట్లను వాడాలని,రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని అన్నారు.అందుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని అన్నారు. ప్రతి ఉద్యోగి ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంస్థ బాగుంటుంది అని,మంచి ఆహారపు అలవాట్లను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని అన్నారు.సింగరేణి సంస్థ యొక్క లక్ష్యం రక్షణతో కూడిన ఉత్పత్తి అన్నారు.కెకె-5 గని100శాతం ఉత్పత్తిని సాధించి ఏరియాలోనే మొదటి స్థానంలో ఉందని అన్నారు.ఈ ఉత్పత్తి సాధించడానికి కృషి చేసిన వారందరిని ఈ సందర్భంగా అభినందించారు.ఇదే ఒరవడితో పనిచేస్తూ అందరికీ ఆదర్శంగా ఉండాలని అన్నారు. నూతనంగా ఉద్యోగంలో చేరిన వారందరూ సీనియర్ ఉద్యోగుల సూచనలు సలహాలు అడిగి తెలుసుకొని, రక్షణ సూత్రాలను విధి నిర్వహణలో తప్పక పాటించాలని సూచించారు.గనిలో అనుకోకుండా ప్రమాదాలకు ఉద్యోగి గురి అయినప్పుడు ఉద్యోగికి అందించే (ఫస్ట్ ఎయిడ్) ప్రథమ చికిత్స గురించి ఉద్యోగులకు అర్థమయ్యే రీతిలో ఫస్ట్ ఎయిడ్ మెంబెర్స్ ఉద్యోగులకు వివరించారు.అనంతరం కమ్యూనికేషన్ సెల్ మందమర్రి ఏరియ వారిచే రక్షణ జాగ్రత్తల గురించి వివరిస్తూ ఉద్యోగులకు అర్థమయ్యే రీతిలో లఘు నాటిక అందరినీ ఆకర్షించుకుంది. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టు జి.ఎం జి.ఎల్. ప్రసాద్, ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ,ఏరియా రక్షణ అధికారి భూ. శంకరయ్య,రక్షణ కమిటీ సభ్యులు బి.రవీందర్, డీజీఎం,ఓ/ఓ డిఐఆర్ (ఓపి), ఎస్.శివశంకర్ డివై, ఎస్ ఈ,(ఈ ఎం),పర్చేస్ డిపార్ట్మెంట్ కార్పొరేట్, శైలేంద్ర కుమార్,ఎస్ఎస్ ఓ, ఓ/ఓ,జి.ఎం. భూపాలపల్లి ఏరియా,ఎల్.రమేష్ జూనియర్ ఎస్ఓ, ఏఎల్ పిమైన్,ఏపీఏ ఏరియా వి.మహేంద్రనాథ్, అడిషనల్ మేనేజర్ ఆర్ అండ్ డి కార్పొరేట్,టీ. పోషమల్లు,అడిషనల్ మేనేజర్ ఎన్విరాన్మెంట్ భూపాలపల్లి ఏరియా డాక్టర్ ఎఎంఎస్ రాధాకృష్ణ, మెడికల్ సూపరింటెండెంట్ ఏరియా హాస్పిటల్ భూపాలపల్లి ఏరియా,పుట్ట రాజలింగయ్య వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ మైనింగ్, దేవులపల్లి శ్రీనివాస్,వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ ఎలక్ట్రికల్,సజ్జనపు కిరణ్,వర్క్ మై ఇన్స్పెక్టర్ మెకానికల్,శంభునాథ్ పాండే కేకే-5గని మేనేజర్ సిహెచ్ రమేష్,సేఫ్టీ ఆఫీసర్,రవళి సంక్షేమ అధికారిని ఉద్యోగులు పాల్గొన్నారు.

## తిరుమల గిరి సర్పంచ్ గా చేరుపల్లి మమత గెలుపు ఖాయం..

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్,డిసెంబర్15(సూర్యరేఖ)** పాలకుర్తి మండల పరిధిలోని తిరుమలగిరి సర్పంచ్ గా మమతని భారీ మెజారిటీతో గెలిపించాలని అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు,ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,లు పిలుపునిచ్చారు.సోమవారం సర్పంచ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ఆయన అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు.బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని కార్యకర్తలు,నేతలు సమన్వయంతో కలిసి పని చేయాలని ఆయన కోరారు.కేసీఆర్ నేతృత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి అభివృద్ధి గురించి గ్రామస్తులకు వివరించి చైతన్యపరచాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయకేతనం మనదే అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కార్పొరేటర్లు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాపన్ పల్లి నూతన సర్పంచ్‌కు సన్మానం



**దామరగిద్ద,డిసెంబర్15(సూర్యరేఖ) :** బాపన్ పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం లో బాపన్ పల్లి గ్రామ నూతన సర్పంచ్ గవినోళ్ల శ్రీనివాస్ ను బొంబాయి సెట్ ముదిరాజ్ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వన్నాడి వెంకటప్ప,లింగారెడ్డిపల్లి సర్పంచ్ మొగుళప్ప,మాడెపల్లి మాజి సర్పంచ్ మాణిక్యప్ప,బాపన్ పల్లి గ్రామ ముదిరాజ్ నాయకులు గవినోళ్ల హన్మంత్,గావినోళ్ల జనార్దన్ చిన్నగారి నర్సప్ప,బొడ్డు నర్సిములు తదితరులు పాల్గొన్నారు.అలాగే వత్తుగుండ్ల సర్పంచ్ మ్యాకల హన్మంతు ముదిరాజ్ ను బాపన్ పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సన్మానం చేశారు.

## అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి..



**రాజేంద్రనగర్,డిసెంబర్15(సూర్యరేఖ)**అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన అత్తాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రంగారెడ్డి జిల్లా అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మధ్యప్రదేశ్ భూపాల్ రాష్ట్రానికి చెందిన అబ్దుల్ గాఫర్ ఖాన్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ చింతల్ మెట్ ప్రాంతంలో హైటెక్ సూట్స్ అపార్ట్మెంట్ లో నివసిస్తున్నాడు.మూడు రోజుల క్రితం తన బెడ్ రూమ్లో డోర్ పెట్టుకొని ఉన్నాడు.మూడు రోజుల తర్వాత తన కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి రూంలో చనిపోయి ఉన్నట్లు గుర్తించారు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు.సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని క్లూస్ టీమ్స్ తో దర్యాప్తు చేపట్టారు.బెడ్రూంలో చనిపోవడంపై కొన్ని అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

## ఈ నెల 20న కొత్త సర్పంచ్ ల ప్రమాణ స్వీకారం..



**దామరగిద్ద,డిసెంబర్15 (సూర్యరేఖ) :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన సర్పంచులు,వార్డు సభ్యులు ఈ నెల 20న బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రమాణస్వీకారం చేయించాలని ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.మూడు విడతల్లో ఎన్నికైన వారు ఒకేసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. దీంతో 12,700 గ్రామపంచాయతీల్లో కొత్త పాలకవర్గాలు కొలువు దీరనున్నాయి.

# సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు సభ్యులకు సన్మానం చేసిన కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణరెడ్డి

**కామారెడ్డి,డిసెంబర్15(సూర్యరేఖ)** కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలలో గెలిచిన సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు సభ్యులను కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణరెడ్డి స్థానిక రాజారెడ్డి గార్డెన్స్ లో నిర్వహించిన బీజేపీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం అనంతరం సన్మానం చేయటం జరిగింది. కార్యక్రమంలో మొదట ఓటమికి గల కారణాలను, గ్రామాల పరిస్థితులను పోటీ చేసిన అభ్యర్థులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం రమణరెడ్డి మాట్లాడుతూ...కామారెడ్డిలో స్థానిక సంస్థల ఎన్నికల్లో డబ్బు,మద్యం లేకుండా ప్రజా సేవ చేసే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చిన వారిని గెలిపించుకోవాలని ప్రయత్నంలో బీజేపీ బలపరిచిన అభ్యర్థులలో గెలుపొందిన వారికి శుభాకాంక్షలు అని, ఓడిన వారు కూడా అధైర్య పడొద్దు అని అన్నారు. డబ్బు,మద్యం లేకుండా




గెలిస్తే తన 5ఏళ్ల పదవి కాలంలో ప్రజలకు సేవ చేసే అవకాశం వస్తుందని, అందుకే బీజేపీ బలపరిచిన అభ్యర్థుల మద్యం, డబ్బు లేకుండా సర్పంచ్ ఎన్నికల్లో పోటో చేసే ప్రయత్నం చేశారని అన్నారు.ఇదే స్ఫూర్తితో రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా పోటీ చేసి ప్రజల వద్దకు వెళతామని అన్నారు.అవినీతి రహిత కామారెడ్డి కోసం చేసే ప్రయత్నంలో కొన్ని ఇబ్బందులు తప్పవని అన్నారు.ఏది ఏమైనా ప్రజా తీర్పును శిరసావహిస్తామని అన్నారు.అనంతరం వివిధ గ్రామాల్లో గెలిచిన సర్పంచ్,వార్డు సభ్యులను శాలువాతో సన్మానం చేశారు.

# శివరాంపల్లిలోని సులేమాన్ నగర్ లో కలుపడాన్ని వ్యతిరేకించిన వై.శ్రీధర్






**రాజేంద్రనగర్,డిసెంబర్15(సూర్యరేఖ)**రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శివరాంపల్లిని సులేమాన్ నగర్ డివిజన్ లో కలుపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని భారతీయ జనతా పార్టీ నాయకులు వై.శ్రీధర్ అన్నారు.భారతీయ జనతా పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శివరాంపల్లి గ్రామాన్ని సులేమాన్ నగర్ లో కలపడం జరిగిందని,ఉప్పర్ పల్లిలో కొంత భాగం మేరకు హైదరగూడ డివిజన్లో కలపడం జరిగిందన్నారు.కావున రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఆఫీసులో రాజేంద్రనగర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ తరపున జీహెచ్ఎంసీలో వినతిపత్రాన్ని అందజేశారు.ఉప్పర్ పల్లి శివరాంపల్లి పూర్తిగా రాజేంద్రనగర్ డివిజన్ లో కలుపాలని చెప్పినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసంపూర్తి,అసంబద్ధంగా డివిజన్లను కలుపడం జరిగిందన్నారు.వెంటనే ఈ అంశంపై పునః పరిశీలించాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు కోరని సదానంద్, మల్లేష్ యాదవ్ హరి కిషన్ జీ సోల్కర్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి,యు. పవన్,గుంటి రాజకుమార్ మల్లేష్ చారి సురేందర్ సరిత రెడ్డి,అంబిక పద్మావతి రజిని గుప్తా తిరుమలేష్ విజయ్ యాదవ్,శివ కుమార్ జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొలిమిగుండ్లలో పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు

**కొలిమిగుండ్ల** : కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం నందు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు ఎంపీడీవో దస్తగిరి బాబు ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 53వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో దస్తగిరి బాబు, కోటపాడు శివరామిరెడ్డి, కలిసి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పొట్టి శ్రీరాములు అమర్రహే అని వారు నినాదాలు చేశారు. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితం కారణంగానే మనకు ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేయడంతోనే 1953 అక్టోబర్ 1న కేంద్ర ప్రభుత్వం స్పందించి మద్రాస్ ప్రభుత్వం నుండి ఆంధ్రప్రదేశ్ ను ప్రత్యేక రాష్ట్రంగా గుర్తించి ప్రకటన చేశారని ఆయన సేవలు త్యాగాల గురించి టిడిపి సీనియర్ నాయకుడు కోటపాడు శివరామిరెడ్డి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దస్తగిరి బాబు, కొలిమిగుండ్ల తహసిల్దార్ శ్రీనివాసులు, చంద్రమౌళీశ్వర గౌడ్, ఎంఈఓ అబ్దుల్ కలాం, అన్వర్ భాష, కోటపాడు శివరామిరెడ్డి, చిన్నపరెడ్డి, డిష్ గోపాల్, నాగార్జున రెడ్డి, సురేష్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూడవ విడత పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
**ఈ నెల 17న మూడవ విడత పంచాయతీ ఎన్నికలులి**
**మూడో విడతలో ఏడు మండలాల పరిధిలో 168 జిపిలకు,1372 వార్డులకు పోలింగ్**

**ఖమ్మం,డిసెంబర్15(సూర్యరేఖ)** : జిల్లాలో ఈ నెల 17న నిర్వహించనున్న మూడవ విడత పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏన్కూరు కల్లూరు పెనుబల్లి సత్తుపల్లి,తల్లాడ వేంసూర్ సింగరేణి మండలాల పరిధిలో ఉన్న 191 గ్రామ పంచాయతీలు 1742 వార్డులకు మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహణకు గతంలో నోటిఫికేషన్ జారీ చేసి, నామినేషన్లు స్వీకరించామని అన్నారు.మూడవ విడతలో ఒక జిపి,9 వార్డులకు నామినేషన్లు దాఖలు కాలేదని 22 గ్రామ పంచాయతీలు,361 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.మిగిలిన 168 గ్రామ పంచాయతీ లకు మొత్తం 485 మంది,1372 వార్డులకు మొత్తం 3369 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారని అన్నారు.2091 బ్యాలెట్ బాక్సులు,2092



పోలింగ్ అధికారులు,2637 మంది ఓపిఓ లను సిద్ధం చేశామని అన్నారు. మూడవ విడతలో 31 లొకేషన్స్ లోని 318 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని,అక్కడ సిసి కెమెరాలు వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.మూడవ విడత పంచాయతీ ఎన్నికలలో మొత్తం 2 లక్షల 44 వేల 283 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకొనున్నారని,ఇందులో లక్షా 18 వేల 900 మంది పురుష,లక్షా 25 వేల 380 మంది మహిళా,ముగ్గురు ఇతరులు ఉన్నారని కలెక్టర్ తెలిపారు.పోలింగ్ కు తగిన విధంగా అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శనీయుడు

**శ్రీరాములుకు ఘన నివాళి..**
**సోమ శ్రీనివాస్ గుప్త**

**రాజేంద్రనగర్,డిసెంబర్15(సూర్యరేఖ)** అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శనీయుడని మాజీ వార్డు సభ్యులు సోమ శ్రీనివాస్ గుప్త అన్నారు. సోమవారం ఆయన వర్ధంతి సందర్భంగా కాటేదాన్ లోని శ్రీవాసవిభవన్ లో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలుగు వారి కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు.తమిళనాడు నుంచి ఆంధ్రాను విడదీసి తెలుగువారందరి కోసం ఒక రాష్ట్రం ఏర్పాటు చేయాలంటూ ఆమరణ దీక్ష చేపట్టాడు. ఆయన ఆత్మ బలిదానంతో ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర అవతరణ సిద్ధించింది.భాషా ప్రాతిపదిక రాష్ట్రాల ఏర్పాటులో ఆయన వేసిన బాట, ఆయన చేసిన త్యాగం ఎన్నటికీ మర్చిపోలేనిది.ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ ఓరుగంటి భద్రయ్య గుప్తా,యువజన సంఘము ప్రెసిడెంట్ గుడిపల్లి శేఖర్ గుప్తా,రాజేంద్రనగర్



మండల సంఘం ప్రెసిడెంట్ వనమాల సురేష్ గుప్తా,చిగుళ్ళపల్లి సతీష్ గుప్తా,చెవ్వా వెంకటేష్ గుప్తా,గోవింద్ జగదీష్ గుప్తా,పాండు గుప్తా, తదితరులు పాలొగన్నారు.

## భీమారంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను వ్యతిరేకించిన ఏఐఐఈఏ

**రాజేంద్రనగర్,డిసెంబర్15(సూర్యరేఖ)** : భీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని పెంచాలనే నిర్ణయాన్ని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం తీవ్రంగా ఖండిస్తోందని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా వెల్లడించారు.ఈ మేరకు సోమవారం ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు.ఈ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ రంగం లాభాల కంటే ప్రజల ప్రయోజనాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.ఈ నెల12వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర మంత్రివర్గం ప్రోక్యాపిటల్ ఆర్థిక సంస్కరణలకు ఆమోదం తెలిపిందన్నారు.భీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని 100శాతం పెంచడం సరైన నిర్ణయం కాదన్నారు1999లో ఐఆర్డీఏ బిల్లును ఆమోదించడం ద్వారా భీమారంగాన్ని జాతీయకరణ నుండి విముక్తి చేశారన్నారు. అప్పటినుండి విదేశీ బాగా సామ్యాలతో కూడిన అనేక ప్రైవేట్ బీమా సంస్థలు జీవిత బీమా మరియు సాధారణ భీమా రంగంలో తమ కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహిస్తున్నాయని గుర్తు చేశారు.ఈ సంస్థలకు వ్యాపార నిర్వహించడానికి మూలధనం ఎప్పుడు సమస్యగా లేదన్నారు.బీమా సంస్థలు వినియోగిస్తున్న మొత్తం మూలధనంలో ఎఫ్డిఐవాటా కేవలం 32 శాతం అని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో భీమా రంగంలో ఎఫ్డిఐ పరిమితిని నూరు శాతం పెంచి విదేశీ మూలధనానికి సంపూర్ణ స్వేచ్ఛ ఇవ్వడం తగదన్నారు.ఇది భారతదేశ ఆర్థిక వ్యవస్థపైనే ప్రభావం చూపుతోందన్నారు.ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే గమనించి తమ నిర్ణయాన్ని పునర్ సమీక్షించుకోవాలన్నారు.అప్పటి వరకు తమ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

## బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండగా నిలుస్తా..

**బాధలో ఉన్న బాధిత కుటుంబానికి బాసటగా నిలవండి..**
**లేడీ పర్సు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించండి..**
**రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి**




**మందమర్రి,డిసెంబర్15(సూర్యరేఖ)** మండల కాంగ్రెస్ నాయకులు పొన్నారం గ్రామ పంచాయతీ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి మాసు సంతోష్ కుటుంబానికి ఎల్లవేళలా అండగా నిలుస్తానని,ఆపదలో ఉన్న బాధిత కుటుంబాన్ని అర్థం చేసుకుని పెద్ద మనసు చేసుకుని లేడీ పర్సు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.మండలంలోని పొన్నారం గ్రామానికి చెందిన మాసు సంతోష్ కూతురు ఇటీవల మృతి చెందగా సోమవారం వారి నివాసానికి వెళ్ళి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.ఆధైర్య పడవద్దని బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటానని బరోసా ఇచ్చారు.కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి మాసు సంతోష్ పరిస్థితిని అర్థం చేసుకుని,అతనికి చేయూత నందించేందుకు గ్రామంలోని ప్రజలందరు లేడీ పర్సు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామస్థులను కోరారు.

## రంగంపేటలో ఎమ్మెల్యే సునీత రెడ్డి కాన్వాయ్ ని అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు..

**కాంగ్రెస్,బీఆర్ఎస్ కార్యకర్తల బాహాబాహీ..**
**రంగంపేటలో ఎమ్మెల్యేకు చుక్కెదురు..**





**కొల్చారం,డిసెంబర్15(సూర్యరేఖ)** మూడవ విడత గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారం చివరి రోజైన సోమవారం కొల్చారం మండలం రంగంపేట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. గ్రామపంచాయతీ కార్యాలయం ముందు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పాటలతో బతుకమ్మ ఆడుతూ ఉండగా రంగంపేట లో ఎన్నికల ప్రచారం కోసం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కాన్వాయ్ వచ్చింది.ఎమ్మెల్యే కాన్వాయ్ కి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అడ్డుపడడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.దీంతో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కారు నుండి దిగి నడుచుకుంటూ కార్యకర్తలు ఎన్నికల ప్రచారం కోసం రంగంపేట కింది బజార్ వైపు వెళ్లారు. అయినప్పటికీ ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది.సమయానికి కొల్చారం ఎస్ఐ మహమ్మద్ మోహినుద్దీన్ స్పందించి వర్గాలను తన సిబ్బందితో కలిసి నెట్టివేసి శాంతింపజేశారు.దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది.

# మైలార్ దేవ్ పల్లి డివిజన్‌ను రెండు భాగాలుగా విభజించడాన్ని వ్యతిరేకిస్తున్నాం





మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్

**రాజేంద్రనగర్,డిసెంబర్15(సూర్యరేఖ)** మైలార్ దేవ్ పల్లి డివిజన్‌ను రెండు భాగాలుగా విభజించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ అన్నారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సౌత్ జోన్ చార్మినార్ కార్యాలయంలో వెంకటేష్ తో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులందరూ కలిసి ప్రజావాణి నిర్వహిస్తున్న అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...డివిజన్ల పునర్విభజనలో భాగంగా మైలార్ దేవ్ పల్లి డివిజన్ ను రెండు భాగాలుగా విభజించి కొత్తగా ఏర్పాటు చేసిన కాటేదాన్ అనే పేరును తొలగించి ఆ స్థానంలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ గా పేరు పెట్టాలని కోరామన్నారు. అదేవిధంగా ఇంకొక డివిజన్ పేరు ఏండ్ల తరబడి ఉన్న పాత లక్ష్మిగూడ గ్రామపంచాయతీ పేరును లక్ష్మీగూడ డివిజన్ కానీ,గణేష్ నగర్ కానీ,దుర్గానగర్ డివిజన్ గాని పేరు పెట్టాలని ప్రజలందరి అభిప్రాయమన్నారు. కాబట్టి కాటేదాన్ పేరును మార్చి మైలార్ దేవ్ పల్లిగా పేరు మార్చి అందులోకి మైలార్ దేవ్ పల్లి పాత గ్రామపంచాయతీతో పాటు మైలార్ దేవ్ పల్లి గ్రామం,మైలార్దేవ్పల్లి పోలీస్ స్టేషన్,మైలార్ దేవ్ పల్లి ప్రాథమిక పాఠశాలతో పాటు,మైలార్ లార్ దేవ్ పల్లి జిల్లా పరిషత్ హైస్కూల్,మైలార్దేపల్లి ఎలక్ట్రికల్ సబ్స్టేషన్,మైలార్దేవ్పల్లి వాటర్ పంప్ హౌస్,మైలార్ దేవ్ పల్లి లైబ్రరీ,మైలార్ దేవ్ పల్లి బస్ స్టాప్ ఇలా చెప్పుకుంటూ పోతే మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోకి ఇంకా చాలా పేర్లు ముడిపడి ఉన్నాయన్నారు.కావున కాటేదాన్ డివిజన్ పేరును మైలార్ దేవ్ పల్లి డివిజన్ గా పేరు మార్చాలని కోరామన్నారు.అదేవిధంగా మైలార్దేపల్లి డివిజన్లోని మోహన్ రెడ్డి నగర్ ను శాస్త్రీపురంలో కల్పకుండా యధావిధిగా మైలార్దేవ్పల్లి డివిజన్ లో ఉండేటట్లు చూడాలన్నారు.మూడు బస్తీలో డోర్ నెంబర్ నంబర్స్ ఒకే సీరియల్ నంబర్లతో పాటు ఈ మూడు బస్తీల పోలింగ్ బూత్ గీతాంజలి హై స్కూల్ లో ఒకటే దగ్గర ఉన్నాయని,కాబట్టి మోహన్ రెడ్డి నగర్ ను యధావిధిగా మైలార్ దేవ్ పల్లి డివిజన్ లోనే కొనసాగించాలని వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో డివిజన్ యూత్ అధ్యక్షులు అక్కెం రాఘవేందర్ యాదవ్,రాజేష్ యాదవ్,అరుణ్ ముదిరాజ్,వెంకట్ రమణ,ఎగ్గే మహేష్ కురుమ,రవీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ సమగ్రత కోసం కృషి చేసిన మహనీయుడు

**సమైక్యతా శిల్పి సర్దార్ పటేల్..**
**సర్దార్ వల్లభాయ్ పటేల్ నేటి యువతకు ఆదర్శనీయుడు..**
**బిజెపి కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి**



**రాజేంద్రనగర్,డిసెంబర్15(సూర్యరేఖ)** సర్దార్ వల్లభాయ్ పటేల్ నేటి యువతకు ఆదర్శనీయుడని చేవెళ్ల పార్లమెంటు బిజెపి కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి అన్నారు. అత్తాపూర్ డివిజన్లోని హైదర్ గూడ సర్దార్ పటేల్ చౌరస్తాలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 75వ వర్ధంతి కార్యక్రమం డివిజన్ అధ్యక్షులు సులిగె వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆయన పాల్గొని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...నిరంకుశ నిజాం మెడలు వంచి ఆనాటి భారతదేశ ఉప ప్రధాని ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ రజాకార్ల పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగించారన్నారు. 565 సంస్థానాలను అఖండ భారత దేశంలో విలీనం చేసిన ఘనత సర్దార్ వల్లభాయ్ పటేల్ దని,నేటి యువత సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఐకమత్యమే మహాబలం అనే నినాదంతో ముందుకు వెళ్లి వారి ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.భారత దేశపు ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ హోంశాఖ మంత్రిగా, ఉప ప్రధాన మంత్రిగా దేశానికి ఎంతో సేవ చేశారని అన్నారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సంస్థానాలను విలీనం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి అమోఘమైందన్నారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోంద్ర కొమురయ్య,అసెంబ్లీ కన్వీనర్ పి.మల్లేష్ యాదవ్,కాడెం సుధాకర్ సత్య నారాయణ ముదిరాజ్,సాబాద విజయ్ కుమార్ ఎస్. జయానంద్ రెడ్డి ఆర్.రాజశేఖర్ కే.కిరణ్ చారి గౌరిగి రాజు,రావుల జగన్ పి.వెంకట్ రెడ్డి,కొంగళ్ల బుచ్చయ్య,కాకులారం కృష్ణ బీట్కూరి సతీష్, లఖన్,శివరాజ్,పొట్ట అనిల్ శ్రీకాంత్ చారి,బీస భరత్,లక్ష్మీకాంత్ రెడ్డి కార్యకర్తలు నాయకులు, యువకులు,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# యాదాద్రి లక్ష్మీనర్సింహ్మస్వామిని దర్శించుకున్న తోకల శ్రీనివాస్ రెడ్డి







**రాజేంద్రనగర్,డిసెంబర్15(సూర్యరేఖ)** యాదాద్రి లక్ష్మీనర్సింహ్మస్వామి ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని నుంచి మైలార్ దేవ్ పల్లి విలేజ్ హనుమాన్ దేవాలయం నుంచి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దర్శనార్థం మొక్కు బడిలో భాగంగా ఈ నెల13వ తేదీన రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాదయాత్రతో కాలినడకతో నియోజకవర్గం నుంచి సుమారు 60మంది యువనాయకులు,నాయకులతో కార్యకర్తలతో కలిసి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి మూడు రోజుల యాత్రగా తరలివెళ్లారు.అందులో భాగంగా ఉదయం పాదయాత్ర ముగించుకొని లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి చేరుకున్నారు.తోకల శ్రీనివాస్ రెడ్డి వారి కుటుంబ సభ్యులతో కలిసి వీఐపీ ప్రోటోకాల్ పాటిస్తూ స్వామి ప్రత్యేక పూజ,దివ్య దర్శనం స్వామి వారిని దర్శించుకున్నారు.స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.దర్శనానంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు.ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఒక కుటుంబ సభ్యులుగా అందరం కలిసి ఈ పాదయాత్రని విజయవంతం చేసినందుకు తనతోపాటు నడిచిన పాదయాత్రలో పాల్గొన్న నియోజకవర్గం నుంచి వచ్చిన యువకులకు నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్య ఆశీస్సులతో నియోజవర్గం ప్రజలందరిపై ఉండాలని,సుఖ సంతోషాలతో చల్లగా ఉండాలని కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిధిలోని బండ్లగూడ జాంగిర్ నార్సింగి మున్సిపాలిటీ శంషాబాద్ మండలంలోని బిజెపి గ్రామ సర్పంచులు,డివిజన్ పరిధిలోని యువకులు నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కారు ఢీకొని యువకుని మృతి..



**కొల్చారం,డిసెంబర్15 (సూర్యరేఖ)** వేగంగా వచ్చిన కారు నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన కొల్చారం మండలం పోతన్ శెట్టిపల్లి టీపాయింట్ వద్ద సోమవారం ఉదయం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లాకు చెందిన శ్రీధర్ రెడ్డి ఘనపూర్ ఐఎంఎల్ డిపోలో పని చేస్తున్నాడు. విధుల్లోకి వెళ్తున్న క్రమంలో బైక్ ఆపుకొని టీ తాగేందుకు నడుచుకుంటూ వెళ్తుండగా హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈప్రమాదంలో శ్రీధర్ రెడ్డికి తీవ్ర గాయాలై మృతి చెందగా కారు రోడ్డు కిందకు వెళ్లిపోయింది.అతి వేగం వల్లనే ప్రమాదం జరిగినట్టు సమాచారం.కారులో ఫ్లవర్ డెకరేషన్ కోసం వేస్తున్న వాళ్ళు ఉన్నట్టు సమాచారం.ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఉన్న వారు అక్కడి నుంచి వెళ్లిపోయినట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన తెలియాల్సి ఉంది.

## గ్రామ అభివృద్ధి చేసి చూపిస్తా..



**మాసాయిపేట,డిసెంబర్14 (సూర్యరేఖ)** ప్రజలు ఒక్కసారి అవకాశం కల్పిస్తే గ్రామ అభివృద్ధి చేసి చూపిస్తానని స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చినప్పటి నుండీకష్టపడి చదువుకొని గ్రాడ్యుయేట్ గా ఉన్న నేను గ్రామానికి సేవ చేసేందుకే వస్తున్నాను గాని ఆశతో కాదని గ్రామస్తులు నాపై నమ్మకం ఉంచి లేడీస్ పర్స్ గుర్తుకు ఓటు వేసినట్లయితే తప్పకుండా గ్రామంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడుతామన్నారు.గతంలో చేసిన అభివృద్ధి కన్నా గ్రామాన్ని మరింత మెరుగు చేసేలా కృషి చేస్తానని తెలిపారు.మాసాయిపేట నూతన మండలం ఏర్పాటు కోసం తన వంతు కృషి ఎంతో ఉందన్నారు. అలాగే గ్రామంలో గ్రామస్తులకు మినరల్ వాటర్ ప్యూరిఫైయర్ అందించాలనే లక్ష్యంతో బాలవికాస సంస్థ వారితో మాట్లాడి వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకొని ప్రజలకు త్రాగునీరుకు అందించేందుకు ముఖ్యపాత్ర పోషించామని తెలిపారు.

## మూడవ విడత పోలింగ్ కు సిబ్బంది నియామకం పూర్తి..



**రంగారెడ్డిజిల్లా, డిసెంబర్15 (సూర్యరేఖ)** ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా సోమవారం పోలింగ్ సిబ్బంది ర్యాండమైజెషన్ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్,జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణరెడ్డి సమక్షంలో పూర్తి చేశారు.సోమవారం జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్,జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సి.నారాయణరెడ్డి నేతృత్వంలో జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ మూడవ విడతలో మూడవ ర్యాండమైజెషన్ ప్రక్రియను నిర్వహించారు.జిల్లాలో నిర్వహించే మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మండలాల వారీగా ఎన్నికల విధులు నిర్వర్తించే4977 ప్రిసైడింగ్,అధికారులను, ఇతర అధికారులతో కూడిన బృందాలనుర్యాండమైజెషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే మొదటి,రెండవ విడత శిక్షణను ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్ చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ అన్నారు.మూడవ విడత మండలాలలో పోలింగ్ సిబ్బందికి ఈ నెల16న వారికి కేటాయించిన మండల కేంద్రాలలో మూడవ విడత శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని,శిక్షణ అనంతరం వారికి ఎన్నికల సామాగ్రి,పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేసి వారిని ప్రత్యేక వాహనంలో పోలీస్ రక్షణతో పోలింగ్ కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. ఎవరైనా ఎన్నికల విధులకు గైర్హాజరు అయినట్లయితే ఎన్నికల నిబంధనలను అనుసరించి కఠిన చర్యలు తీసుకోబడుతాయని అని కలెక్టర్ హెచ్చరించారు.మొదటి విడత,రెండవ విడతలలో 125 మందికి పైగా పోలింగ్ సిబ్బంది విధులకు గైర్హాజరు అయినారని,ఇంకొంత మంది సిబ్బంది విధులకు హాజరై రిజిస్టర్ లో సంతకాలు చేసి ఎన్నికల విధులకు హాజరు కాకుండా ఎంపీడీఓలకు సహకరించలేదని,వీరందరిపై కఠినంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. మూడవ విడతలో కూడా ఎవరైనా గైర్హాజరైనా, హాజరు అయి ఎన్నికల విధుల్లో పాల్గొనకుండా ఉంటే సస్పెండ్ చేస్తామని కలెక్టర్ తెలిపారు.ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్,(లోకల్ బాడీస్)డీపీఓ సురేష్ మోహన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ గా గెలిపిస్తే అందుగులపేట గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా..శక్తి వంచన లేకుండా పని చేస్తా

**బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి లౌడం శ్రీలత**



**మందమర్రి,డిసెంబర్15(సూర్యరేఖ)** ఓటు వేసి ఆదరించి గెలిపిస్తే అందుగులపేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చి దిద్దుతానని బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి లౌడం శ్రీలత అన్నారు.ప్రచారం చివరి రోజు సోమవారం గ్రామంలోని అన్ని వాడల్లో బిఆర్ఎస్ నాయకులు తన మద్దతు దారులతో కలసి ర్యాలీగా ఇంటింటికి వెళ్లి తనను ఆదరించి గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరిం చేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.సర్పంచ్ గా ఆదరిస్తే గ్రామ సర్వతోముకాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.గ్రామంలోని ప్రతి సమస్యను తెలుసుకున్న వ్యక్తిగా నన్ను ఆదరించి గెలిపిస్తే గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి చూపిస్తానని ఆమె పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధికి నిస్వార్ధంగా సేవ చేసే భాగ్యం కల్పించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి పారదర్శకంగా అందిస్తానని అన్నారు.ఆదరించి ఓటు వేసి గెలిపిస్తే గ్రామ రూపురేఖలు మారుస్తూ గ్రామంలో గ్రామ రైతులకు ఇబ్బందిగా మారిన పెద్దవాగుపై వంతెన నిర్మాణం, డ్రైనేజీలు,సీసీ రోడ్లు,సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు,గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తానన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు వచ్చానని ఆశీర్వదించి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు.ఈ నెల 17వ తేదీ న జరిగే పంచాయతీ ఎన్నికల్లో తమ ఓటు నాకు వేసి భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ లౌడం రాజ్ కుమార్,బిఆర్ఎస్ నాయకులు, మద్దతు దారులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# బంపర్ విజయం..అక్కన్నపేటలో యాదగిరి విజయోత్సవ ర్యాలీ







**రామాయంపేట,డిసెంబర్15(సూర్యరేఖ)** రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామపంచాయతీలో సర్పంచ్ ఎన్నికల చరిత్రలోనే అరుదైన ఘనవిజయం నమోదైంది.భారతీయ జనతా పార్టీ తరపున బరిలోకి దిగిన బక్కయ్యగారి యాదగిరి 600 పైచిలుకు ఓట్ల మెజార్టీతో ప్రత్యర్థులను మట్టికరిపిస్తూ ఘన విజయం సాధించారు.ఈ విజయంతో అక్కన్నపేటలో బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది.సోమవారం సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి,ఉప సర్పంచ్ ప్రసాద్,తో పాటు వార్డు సభ్యుల విజయం సందర్భంగా గ్రామంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.పార్టీ కార్యకర్తలు,అభిమానులు, వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని బీజేపీ జెండాలతో ఊరేగుతూ సంబరాలు జరిపారు. డప్పులు, నినాదాలు,పూలవర్షాల మధ్య సాగిన ఈ ర్యాలీ అక్కన్నపేటను పండుగ వాతావరణంతో నింపింది. ఈ సందర్భంగా నూతన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు మాట్లాడుతూ...తమపై నమ్మకం ఉంచి భారీ మెజార్టీతో గెలిపించిన గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.అక్కన్నపేట అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని,తాగునీరు, రహదారులు,పారిశుధ్యం,సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రజలతో కలిసి ముందుకు సాగుతామన్నారు.బీజేపీ నాయకులు ఈ ఫలితాన్ని ప్రజల విశ్వాసానికి నిదర్శనంగా అభివర్ణించారు. అక్కన్నపేటలో సాధించిన ఈ బంపర్ మెజార్టీ రానున్న రోజుల్లో మండలం,జిల్లా రాజకీయాల్లో కీలక ప్రభావం చూపనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఈ కార్యక్రమంలో కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సమస్యలపై పోరాడే సిపిఐతోనే అందుగులపేట అభివృద్ధి సాధ్యం

**ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు,వేజ్ బోర్డ్ కమిటీ శాశ్వత సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య**

**మందమర్రి,డిసెంబర్15(సూర్యరేఖ)** సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఐతోనే అందుగులపేట గ్రామసమగ్ర అభివృద్ధి సాధ్యమని సిపిఐ అనుబంధ ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు వేజ్ బోర్డ్ కమిటీ శాశ్వత సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు.అందుగులపేట సర్పంచ్ అభ్యర్థిగా సిపిఐ బలపరిచిన అభ్యర్థి రోడ్డ తిరుమల నరేష్ ను గెలిపించాలని కోరుతూ గ్రామంలో సోమవారం విస్తృతంగా ప్రచారం చేపట్టారు.సిపిఐ, ఏఐటియుసి నాయకులు,తన మద్దతు దారులతో కలసి గ్రామంలో బారి ర్యాలీ నిర్వహించి ఓటర్లను కలిసి సిపిఐ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ. అందుగులపేట గ్రామ సమగ్ర అభివృద్ధి, నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే సిపిఐ అభ్యర్థి గెలుపు ద్వారానే సాధ్యమవుతుందన్నారు. సిపిఐ బలపరిచిన అభ్యర్థి రొడ్డ తిరుమల నరేష్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించి గ్రామ అభివృద్ధికి పాటుపడాలన్నారు. గ్రామ ప్రజలకు నిస్వార్థమైన సేవలు అందించేందుకు ముందుకు వచ్చిన తిరుమలను ఆదరించి ఆశీర్వదించాలన్నారు. అందుగులపేటను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు తిరుమలకు అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం సర్పంచ్ అభ్యర్థి రొడ్డ తిరుమల నరేష్ మాట్లాడుతూ...శక్తి వంచన లేకుండా పని చేస్తానని,దోచుకుని దాచుకునే వాళ్లకు ఓటు వేయవద్దని,మోసపోయి గోసపడవద్దని,తనను ఆదరించి గెలిపిస్తే గ్రామ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని అన్నారు. గ్రామస్తులకు ఇబ్బందికరంగా మారిన పెద్దవాగుపై వంతెన నిర్మాణానికి కృషి చేయడంతో పాటు గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తానన్నారు.అందరికీ నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సేవ చేస్తానని



స్పష్టం చేశారు.గ్రామస్తులందరూ ఈనెల 17న జరగనున్న ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగుల లక్ష్మణ్,గ్రామఎన్నికల కన్వీనర్ వనం సత్యనారాయణ పట్టణ కార్యదర్శి కామెర దుర్గరాజ్ నాయకులు ఆంథోని, దినేష్ బండారి రాజేశం, తాళ్లపల్లి వీరయ్య విష్ణు, గౌతమ్ దుర్గం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మూడవ విడుత ఎన్నికలు జరిగే మండలాలలో 163 బిఎన్ఎస్ఎస్ అమలు..

**మంచిర్యాల,డిసెంబర్15(సూర్యరేఖ)**రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో గ్రామ పంచాయతీ ఫేజ్-3ఎన్నికల సమయంలో శాంతి భద్రతల పరిరక్షణ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం 17వ తారీఖున సెక్షన్163 బిఎన్ఎస్ఎస్ ఉత్తర్వులను సోమవారం రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా జారీ చేశారు.ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ... రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి జోన్ మూడవ విడత సుల్తానాబాద్ ఎలిగేడు, పెద్దపల్లి,ఓదెల మండలాలలో మంచిర్యాల జోన్ పరిధిలో భీమారం చెన్నూర్,జైపూర్,కోటపల్లి, మందమర్రి మండలాలలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి పైన తెలియజేసిన ప్రాంతాలలో సెక్షన్163బిఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో 5 మంది లేదా అంతకంటే ఎక్కువ మంది ప్రజలు గుమిగూడకూడదని సంబంధిత అధికారుల నుండి ముందస్తు అనుమతి పొందిన



తర్వాత మాత్రమే చట్టబద్ధమైన సమావేశాన్ని నిర్వహించాలని ఇట్టి ఉత్తర్వులు15వ తారీఖు సాయంత్రం 05:00 గంటల నుండి 17వ తారీఖు ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయి ఫలితాలు వెల్లడి అయ్యే వరకు అమలులో ఉంటుందని తెలిపారు.ఆదేశాలను ఉల్లంఘించే ఏ వ్యక్తి అయినా చట్టం ప్రకారం చర్యలు తీసుకోబడునని కమీషనర్ తెలిపారు.

## సానెం శ్రీనివాస్ గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు



**రాజేంద్రనగర్,డిసెంబర్15(సూర్యరేఖ)** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సానెం శ్రీనివాస్ గౌడ్ 55వ జన్మదినం సందర్భంగా బాబుల్ రెడ్డినగర్ శ్రీమకర జ్యోతి సన్నిధానం తరుపున శాలువా కప్పి సన్నిధానం ఫోటో ఇచ్చి సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మాజీ వార్డ్ సభ్యులు సోమ శ్రీనివాస్,సన్నిధానం గురుస్వామి మల్లేష్,విజయకుమార్, మాహిందర్ తదితరులు పాల్గొన్నారు.


## కోవర్టుల ద్రోహం..కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి.. లోపలి కుట్రలే ఓటమికి కారణం..కాంగ్రెస్ కార్యకర్తల సంచలన ఆరోపణ



**రామాయంపేట,డిసెంబర్15(సూర్యరేఖ)** మండలంలోని కాట్రియాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఓటమికి పార్టీకి చెందిన కొందరు కోవర్టులే ప్రధాన కారణమని ఆగ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు ఆరోపించారు.ఈ మేరకు సోమవారం గ్రామంలోని పెద్దమ్మ ఆలయం వద్ద సమావేశమైన కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఎన్నికల సమయంలో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన కొందరిని గుర్తించామని,వారి చర్యల వల్లనే పార్టీ అభ్యర్థి ఓటమిపాలయ్యాడని కార్యకర్తలు పేర్కొన్నారు.ముఖ్యంగా కోవర్టుల వ్యవహారంలో కీలక పాత్ర పోషించాడని అనుమానిస్తున్న యువ నాయకున్ని సమావేశానికి పిలిచినా హాజరుకాలేదని వారు ఆరోపించారు.ఈ మొత్తం అంశాన్ని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దృష్టికి తీసుకెళ్లి,పార్టీ పరంగా తగిన చర్యలు తీసుకునేలా కోరతామని కార్యకర్తలు తెలిపారు.పార్టీ శ్రేణుల్లో ఇలాంటి వ్యవహారాలు పునరావృతం కాకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడ్డారు.

## గ్రామాల్లో అభివృద్దే లక్ష్యం..కాంగ్రెస్ లోని రావాలని పిలుపు..

**పల్లె రామచంద్రంగౌడ్**



**రామాయంపేట,డిసెంబర్15 (సూర్యరేఖ)** రామాయంపేట మండల కేంద్రంలో టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచంద్రంగౌడ్ సోమవారం తన స్వగృహంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజాస్వామ్యంలో తెలంగాణ ప్రజా ప్రభుత్వంలో ప్రజల అభీష్టం మేరకే ప్రజా ప్రతినిధుల ఎన్నికలు జరిగాయని పేర్కొన్నారు.గ్రామపంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి సంబంధించి సుమారు70శాతం వరకు సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు ఎన్నికయ్యారని తెలిపారు.ఇది కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు ఇచ్చిన స్పష్టమైన మద్దతుగా ఆయన అభివర్ణించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందని వాటి ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అన్నారు.తాజాగా గెలిచిన ప్రజాప్రతినిధులు గ్రామాల్లో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు బాధ్యతతో పనిచేయాలని సూచించారు.అలాగే స్వతంత్రులుగా గెలిచిన వారు,ఇతర పార్టీలకు చెందిన నాయకులు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఆయన పిలుపునిచ్చారు.గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండి అనేక ప్రజాహిత కార్యక్రమాలు అమలు చేస్తోందని,వచ్చే మూడేళ్ల పాటు కూడా ప్రభుత్వం కొనసాగుతుందని పేర్కొన్నారు.గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా చేపట్టేందుకు నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి రావడం అనుకూలమని ఆశాభావం వ్యక్తం చేశారు.గెలిచిన ప్రతి ప్రజాప్రతినిధి ప్రజల అవసరాలను అంచనా వేసుకొని ఐదేళ్ల కాలంలో తమ తమ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు.అధికార పార్టీకి ప్రజలు ఇచ్చిన తీర్పును బాధ్యతగా తీసుకొని భవిష్యత్తులో ప్రతి గ్రామంలో సంక్షేమ ఫలాలు అందేలా పని చేయాలని ఆయన కోరారు. చివరిగా అధికార పార్టీకి మెజార్టీగా మద్దతు ఇచ్చిన ప్రజలకు గెలిచిన ప్రజాప్రతినిధులకు శుభాభినందనలు తెలియజేశారు




# ఫంకీ రిలీజ్ డేట్‌పై విశ్వక్‌సేన్ టీం క్లారిటీ..!

టాలీవుడ్‌లో ఉన్న మల్టీ టాలెంటెడ్ యాక్టర్లలో ఒకడు విశ్వక్‌సేన్ ఈ క్రేజీ యాక్టర్ హీరోగా నటిస్తున్న మూవీ 'ఫంకీ'. జాతిరత్నాలు ఫేం కేవీ అనుదీప్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో కోలీవుడ్ బ్యూటీ కయాదు లోహర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్లకు మంచి స్పందన వస్తుంది. కామెడీ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రాన్ని ఎప్పుడు విడుదల చేస్తారనే దానిపై మేకర్స్ క్లారిటీ ఇచ్చేశారు. ఫంకీ చిత్రాన్ని 2026 ఫిబ్రవరి 13న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటిస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. విశ్వక్‌సేన్ కింద కూర్చుని ఉండగా..కయాదు లోహర్ అతడి తొడలు, భుజంపై డిఫరెంట్ మూడ్స్‌లో కూర్చుని కనిపిస్తుండగా.. బ్యాక్ డ్రాప్‌లో మూవీ రీల్‌ను చూడొచ్చు. ఇందులో విశ్వక్ సేన్ సినీ దర్శకుడిగా నటిస్తుండగా.. కయాదు లోహర్ నిర్మాతగా కనిపించనుంది. తాజా లుక్ నెట్టింట వైరల్ అవుతోంది. అల్లూరి సినిమా తర్వాత కయాదు లోహర్ తెలుగులో చేస్తున్న రెండో చిత్రం కావడంతో అంచనాలు పెరిగిపోతున్నాయి. ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైనమెంట్స్, ఫార్ర్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ మూవీ సినీ ఇండస్ట్రీపై సెటైరికల్‌గా తెరకెక్కుతున్నట్టు సమాచారం.



# హైదరాబాద్‌కు అజయ్ దేవగన్ సినీ-ఎక్స్ మల్టీప్లెక్స్ తెలుగు స్టార్లకు పోటీగా బాలీవుడ్ స్టార్ అడుగు


ఇటీవల నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ - 2025 సందర్భంగా బాలీవుడ్ స్టార్‌లు సల్మాన్ ఖాన్, అజయ్ దేవగన్ భారీ పెట్టుబడులతో హైదరాబాద్ వైపు దృష్టి సారించారన్న చర్చ హాట్ టాపిక్‌గా మారింది. సల్మాన్ ఖాన్ అత్యాధునిక ఫిలిం స్టూడియో ఏర్పాటు దిశగా ప్రయత్నాలు చేస్తున్నారన్న వార్తలు వినిపించగా, అజయ్ దేవగన్ కూడా స్టూడియో నిర్మాణం కాకుండా భిన్నమైన వ్యూహంతో ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. అజయ్ దేవగన్ దేశవ్యాప్తంగా 'దేవగన్ సినీ-ఎక్స్' పేరుతో మల్టీప్లెక్స్ స్క్రీన్‌లను ప్రారంభించాలనే ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలి దశలోనే పలు నగరాల్లో స్క్రీన్‌లను ఏర్పాటు చేసి, మొత్తం మీద సుమారు 250 స్క్రీన్‌లను వివిధ దశల్లో ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే గుర్‌గావ్‌లో 'దేవగన్ సినీ-ఎక్స్' పేరుతో ఒక థియేటర్ విజయవంతంగా నడుస్తోంది. ఇంతకుముందు అజయ్ దేవగన్-కాజోల్ దంపతులు తమ పిల్లల పేర్లపై 'ఎన్-వై సినిమాస్' పేరిట థియేటర్ వ్యాపారం నిర్వహించినప్పటికీ, ఇప్పుడు బ్రాండ్ విలువ పెంచే ఉద్దేశంతో 'దేవగన్' అనే పేరునే ముందుకు తెచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో దేవగన్ సినీ-ఎక్స్ మల్టీప్లెక్స్ ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయి. నగరంలోని కర్మన్‌ఘాట్ కొలీజియం మాల్‌లో ఏడు స్క్రీన్‌లతో కూడిన లగ్జరీ మల్టీప్లెక్స్‌ను వచ్చే ఏడాది ప్రారంభించనున్నారు. దీనిని దేశవ్యాప్తంగా విస్తరించాలన్నది అజయ్ దేవగన్ దీర్ఘకాల లక్ష్యంగా తెలుస్తోంది. సినిమా కెరీర్ విషయానికి వస్తే, అజయ్ దేవగన్ ఇటీవల 'సన్ ఆఫ్ సర్దార్ 2', 'దే దే ప్యార్ దే 2' చిత్రాల్లో కనిపించారు. 'దే దే ప్యార్ దే' బాక్సాఫీస్ వద్ద సంతృప్తికర ఫలితాన్ని అందుకుంది. ఇక ప్రస్తుతం 'దృశ్యం 3', 'ధమాల్ 4', 'రేంజర్' వంటి చిత్రాలు షూటింగ్ దశలో ఉండగా, ఇవన్నీ 2026లో విడుదలై ఆయన కెరీర్‌కు మరింత బూస్ట్ ఇవ్వనున్నాయనే అంచనాలు ఉన్నాయి.మరోవైపు, హైదరాబాద్‌లో ఇప్పటికే తెలుగు స్టార్‌లు మల్టీప్లెక్స్ రంగంలో దూసుకుపోతున్నారు. మహేష్ బాబు %-% ఏఎంబీ మాల్, అల్లు అర్జున్ %-% ఏఏఏ సినిమాస్, రవితేజ %-% ఏఆర్‌టీ సినిమాస్ ఇప్పటికే ప్రారంభమయ్యాయి. త్వరలో మహేష్ బాబు%-%వెంకటేష్ కాంబినేషన్‌లో 'ఏఎంబీ క్లాసిక్' కూడా ప్రారంభం కానుంది. అల్లు కుటుంబం హైదరాబాద్ అవుటర్‌లో భారీ ఫిలిం స్టూడియోతో పాటు మరో మల్టీప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.ఈ నేపథ్యంలో, ఇప్పుడు అజయ్ దేవగన్ కూడా మల్టీప్లెక్స్ రంగంలో అడుగుపెట్టడంతో, తెలుగు స్టార్‌లతో పోటీ ఎలా ఉండబోతోందన్న ఆసక్తి సినీ వర్గాల్లో నెలకొంది. బాలీవుడ్ స్టార్ బ్రాండ్ హైదరాబాద్ మార్కెట్‌లో ఏ స్థాయిలో సక్సెస్ సాధిస్తుందో వేచి చూడాల్సిందే.

# బాలీవుడ్‌పై కన్నేసిన 'కాంతార చాప్టర్ 1' బ్యూటీ .. ఇక హంగామా మాములుగా ఉండదు


కాంతార చాప్టర్ 1 సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న నటి రుక్మిణి వసంత్ ఇప్పుడు కొత్త దిశగా అడుగులు వేస్తోంది. కాంతార చాప్టర్ 1 చిత్రంలో యువరాణి కనకవతి అనే ప్రతినాయిక పాత్రలో నటించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచిన రుక్మిణి, తన కెరీర్‌లో తొలి పాన్ ఇండియా హిట్ ఇచ్చిన ఆనందాన్ని ఇప్పటికీ ఆస్వాదిస్తున్నట్లు వెల్లడించింది.తెలుగు, కన్నడ చిత్రసీమలకు ఇప్పటికే పరిచయమైన ఈ బ్యూటీ, ఇప్పుడు బాలీవుడ్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. అదే సమయంలో తమిళ చిత్రాల్లోనూ క్రేజీ ఆఫర్లకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు సమాచారం. బాలీవుడ్‌పై తన ఆసక్తిని బహిరంగంగానే వ్యక్తం చేసిన రుక్మిణి, హిందీ భాషతో తనకున్న అనుబంధమే అక్కడ నటించాలనే తపనకు కారణమని చెప్పింది. హిందుస్థాన్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. "హిందీ నాకు చిన్నప్పటి నుంచే పరిచయం ఉన్న భాష. మా కుటుంబానికి సైనిక నేపథ్యం ఉండటంతో, వివిధ కంటోన్మెంట్ల మధ్య అనుసంధాన భాషగా హిందీ ఉండేది. అందుకే ఆ భాషపై నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఇప్పటివరకు హిందీలో నటించే అవకాశం రాలేదు. కానీ, ఆ భాషలో నా ప్రతిభను నిరూపించుకోవాలని చాలా ఉత్సాహంగా ఉన్నాను. దేవుడి దయతో త్వరలోనే ఆ ప్రయాణం ప్రారంభమవుతుందని ఆశిస్తున్నాను" అని తెలిపింది.రిషబ్ శెట్టి దర్శకత్వంలో తెరకెక్కిన కాంతార చాప్టర్ 1 విడుదలై సంచలన విజయం సాధించగా, ఇందులో రుక్మిణి వసంత్ ప్రతినాయిక పాత్రలో కనిపించి ప్రత్యేకమైన సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఆమె అందచందాలు, నటన ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించాయి. ప్రస్తుతం ఈ సినిమా విజయం ఇచ్చిన ఆనందాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్నానని చెప్పిన రుక్మిణి, త్వరలో కాంతార టీమ్ అంతా కలిసి విజయోత్సవాన్ని జరుపుకుంటామని వెల్లడించింది. ఉత్తరాఖండ్, రాజస్థాన్, జార?ండ్ సహా దేశం నలుమూలల నుంచి వస్తున్న స్పందనలు తనను ఎంతో ఉత్సాహపరుస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. బాలీవుడ్ ఎంట్రీతో పాటు దక్షిణాది భాషల్లోనూ రుక్మిణి వసంత్ కెరీర్ మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# ఓన్లీ పర్ఫార్మెన్స్.. రూటు మార్చేసిన రవితేజ హీరోయిన్



మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది భాగ్యశ్రీ బోర్సే. ఇటీవలే ఆంధ్ర కింగ్ తాలూకా, కాంతా సినిమాలలో కూడా మెరిసింది. కెరీర్లో అతితక్కువ సమయంలోనే క్రేజీ ఆఫర్ కొట్టేసింది. తాజా టాక్ ప్రకారం భాగ్యశ్రీ బోర్సే ఫీ మేల్ సెంట్రిక్ సినిమాను లైన్లో పెట్టిందట. అంతేకాదు వన్ ఆఫ్ ది లీడింగ్ ప్రొడక్షన్ హౌస్ స్వప్నాదత్, ప్రియాంకా దత్ స్వప్నా సినిమా బ్యానర్‌పై ప్రతిష్టాత్మక సినిమాను తెరకెక్కిస్తున్నారు. కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు చేయడంలో ఎప్పుడూ ముందుంటుంది ఈ బ్యానర్. ఇంకా టైటిల్ ఫిక్స్ కాని ఈ చిత్రానికి డెబ్యూ డైరెక్టర్ రమేశ్ దర్శకత్వం వహిస్తున్నాడు. పవర్ ఫుల్ ఉమెన్ సెంట్రిక్ సబ్జెక్టుతో స్క్రిప్ట్ రెడీ చేశాడట రమేశ్. ఇప్పటిదాకా గ్లామరస్ రోల్స్ లో మెరిసిన భాగ్యశ్రీని ఇక నటనకు ఆస్కారమున్న పాత్రలో చూపించబోతున్నాడట డైరెక్టర్. మహారాష్ట్రలోని ఛత్రపతి శంబాజీనగర్‌కు చెందిన ఈ భామ హిందీ ప్రాజెక్టులు యారియాన్, చందూ చాంపియన్‌లో కామియో రోల్స్ లో నటించింది. మిస్టర్ బచ్చన్ సినిమాకు గాను బెస్ట్ ఫీ మేల్ డెబ్యూ ఫర్ తెలుగు అవార్డు అందుకుంది. మరి తాజాగా చేస్తున్న లేడీ ఓరియెంటెడ్ సినిమా భాగ్యశ్రీలోని నయా యాంగిల్‌ను చూపించడం ఖాయమైనట్టేనని ఈ వార్త క్లారిటీ ఇచ్చేస్తుది. మరి భాగ్యశ్రీ ఎలాంటి కథాంశంతో ప్రేక్షకుల ముందుకొస్తుందనేది ఆసక్తికరంగా మారింది.



# ఫ్యాన్స్ గెట్ రెడీ.. సూర్య 46 షూట్‌పై నయా అప్‌డేట్ ఇదే..!

కోలీవుడ్ యాక్టర్ సూర్య బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. వీటిలో ఒకటి వెంకీ అట్లూరి డైరెక్షన్‌లో చేస్తున్న సూర్య 46 (%ూబతీఱఆ% 46). ఈ చిత్రంలో ప్రేమలు ఫేం మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తుండగా.. సీనియర్ నటి రవీనా టాండన్ కీలక పాత్ర పోషిస్తోంది. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి బయటకు వచ్చింది. ఫైనల్‌గా సూర్య 46 షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు త్వరలోనే పూర్తి కానున్నాయనని టాలీవుడ్ సర్కిల్ సమాచారం. ఇంకేంటి మరి త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీపై క్లారిటీ వచ్చే అవకాశాలున్నట్టు కూడా తాజా అప్డేట్ హింట్ ఇచ్చేస్తుంది. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్‌కుమార్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. సూర్య 46 చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ , ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశి, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో సూర్య టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.సూర్య మరోవైపు సుధాకొంగర డైరెక్షన్‌ల సూర్య 47లో నటిస్తున్నాడని తెలిసిందే.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,